


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 02-10-2024 | సంపుటి - 21 సంచిక -170 రూ : 4 పేజీలు : 8




## ఆక్రమణల కూల్చివేత

2లో

రామమ్మకుంట చెరువు బఫర్ జోన్‌లో కొత్త భవన నిర్మాణం

నిథిమ్ యాజమాన్యం భవనాన్ని కూల్చివేసిన అధికారులు



రేషన్ కార్డు లేనోళ్లకు గుడ్ న్యూస్..

## త్వరలో రుణమాఫీ

- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**తెలంగాణ బ్యూరో**: రాష్ట్రం లోని రైతులందరికీ రుణమాఫీ జరిగిందని ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి లేదు. చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదు. ఇదిలా ఉంటే తాజాగా మంత్రి తుమ్మల కీలక ప్రకటన చేశారు. రేషన్ కార్డులు లేని రైతులకు సైతం రుణమాఫీ చేయబోతున్నట్టు ప్రకటించారు. రేషన్ కార్డు లేనటువంటి వాళ్ళ క్రాప్ లోన్ ఖాతాలన్ని కొద్దిరోజుల్లో తమకు అందుతాయని..వాళ్లకు కూడా 2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. 2 లక్షల పైన ఉన్న వాళ్ళందరికీ షెడ్యూల్ ప్రకటించి దాని ప్రకారం 31 వేల కోట్లు ఈ సంవత్సర కాలంలోనే రైతుల ఖాతాలో వేసే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు.

## రేవంత్.. ఈ చిన్నారుల కన్నీళ్లకు కారకులెవరు?

- కూలిన ఇండ్ల వద్ద చిన్నారుల కన్నీళ్లు
- సోషల్ మీడియాలో వీడియో వైరల్



**హైదరాబాద్:** కోర్టులు మందలించినా.. బాధితులు తిరగబడుతున్నా హైడ్రా యాక్షన్ కొనసాగుతూనే ఉంది. కూలిన ఇండ్ల దగ్గర బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. తాజాగా శంకర్ నగర్లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇక్కడ కూలిపోయిన ఇండ్ల దగ్గర చిన్నారుల కన్నీళ్లు పెట్టుకుంటున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అసలు ఈ చిన్నారుల కన్నీళ్లకు కారకులెవరు? అంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇక ఈ వీడియోపై కేటీఆర్ కూడా స్పందించారు. 'వారి గూడును కూల్చేశారు.. వారి కలలను చిదిమేశారు.' కేటీఆర్ ట్వీట్ చేశారు. మూసీ నది పరివాహక ప్రాంతాల్లో కూల్చివేతలు ప్రారంభమయ్యాయి. పైసా పైసా కూడబెట్టుకుని కట్టుకున్న పేదల ఇండ్ల మీదికి రేవంత్ రెడ్డి సర్కార్ బుల్డోజర్లను పంపింది. సామాన్లు తీసుకునే వరకు కూడా ఆగకుండా.. పేదల ఇండ్లను ప్రభుత్వం నేలమట్టం చేసింది. కూల్చివేసిన ఇండ్ల వద్ద ఓ ఇద్దరు చిన్నారులు.. మట్టిపెల్లలతో మళ్లీ ఇల్లును నిర్మించుకుంటున్న దృశ్యం ప్రతి ఒక్కరి హృదయాలను కలిచివేస్తుంది. ఈ వీడియోపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వారి గూడును కూల్చేశారు.. వారి కలలను చిదిమేశారు. ఆ కూలిన ఇంటి శిథిలాలలో వారి జీవితాలను వెతుక్కుంటున్నారని కేటీఆర్ భావోద్వేగానికి లోనయ్యారు.





## తాటాకు చప్పుళ్లకు భయపడను

- మీ తాట తీసేందుకు వచ్చా
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- దాడి అనంతరం మీడియాతో కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్:** హైడ్రా బాధితులకు మద్దతు తెలపడానికి వెళ్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మీద కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి యత్నించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేటీఆర్ తీవ్రస్థాయిలో స్పందించారు. తాను తాటాకు చప్పుళ్లకు భయపడేవాడిని కాదని హెచ్చరించారు. మీ తాట తీసేందుకు వచ్చానంటూ తీవ్రస్థాయిలో వ్యాఖ్యానించారు. గోల్నాక మూసీ బాధితులను పరామర్శించేందుకు వెళ్తుండగా ముషీరాబాద్‌లో కేటీఆర్ కారును అడ్డుకున్నారు. ఆపై దాడికి యత్నించారు. అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది, బీఆర్ఎస్ కార్యకర్తలు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కాంగ్రెస్ గూండాలు ఏ మాత్రం తగ్గలేదు. కొందరైతే ఏకంగా కారుపైకి ఎక్కి మరీ దురుసుగా ప్రవర్తించారు. ఈ ఘటన అనంతరం కేటీఆర్ స్పందించారు. తాను ప్రజలకు అండగా నిలబడటానికి వస్తుంటే రేవంత్ తనను అపలేరని చెప్పారు.

## కాంగ్రెస్‌ది అసమర్థ పాలన



ఖానాపూర్‌లో మార్కింగ్ కోసం వెళ్లిన రెవెన్యూ అధికారులు అడ్డుకున్న స్థానికులు

2లో

## తిరుమల లడ్డూపై సిట్ దర్యాప్తు నిలిపివేత

- సుప్రీం కోర్టు విచారణ నేపథ్యంలో చర్యలు
- ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు వెల్లడి

**ఏపీ బ్యూరో** : ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యిపై దర్యాప్తు కోసం ఏర్పాటు చేసిన సిట్ విచారణను నిలిపివేసింది. సోమవారం లడ్డూ వ్యవహారంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో లడ్డూ కల్తీ అయినట్లు సరైన ఆధారాలు లేవని చెప్పిన సుప్రీం కోర్టు విచారణను గురువారానికి వాయిదా వేసింది.ఈ నేపథ్యంలో సిట్ బృందం గురువారం వరకూ దర్యాప్తుకు బ్రేక్ ఇచ్చింది. ఈ మేరకు సిట్ దర్యాప్తు నిలిపివేసినట్లు ఏపీ డీజీపీ ద్వారకా తిరుమల రావు తిరుమలలో నిర్వహించిన మీడియా సమావేశంలో వెల్లడించారు. కోర్టు తదుపరి ఆదేశాలు మేరకు విచారణ కొనసాగిస్తామన్నారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో డీజీపీ సమీక్షించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా మొదటి రోజు సీఎం చంద్రబాబు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని, ఐదోవ రోజు గరుడ వాహన సేవ రోజు అదపు భద్రతా ఏర్పాట్లు చేస్తామని వెల్లడించారు. నాలుగు వేల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. 2700 సీసీ కెమెరాలతో పాటు అదనంగా బాడీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనుమానితులను గుర్తించేందుకు ఫింగర్ ప్రింట్ వ్యవస్థను వినియోగించనున్నట్లు తెలిపారు. సోషయల్ మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారంపై నిఘా పెడతామన్నారు. గ్యాలరీలో 2 లక్షల మంది భక్తులు వీక్షించే అవకాశం ఉండగా, అదనంగా 80 వేల మంది భక్తులను ప్రత్యేక క్యూ లైన్ల ద్వారా అనుమతిస్తామన్నారు. 2.5 లక్షల మంది ప్రయాణించేలా గరుడ సేవ రోజు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తుందన్నారు.



## మూసీ ప్రక్షాళన చేసి తీరుతాం

- ఎన్ని కోట్లు ఖర్చైనా ఈ ప్రాజెక్టు ఆగదు
- అడ్డుకుంటే ప్రత్యేక ఉద్యమం చేస్తాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో:** మూసీ పరివాహక ప్రాంతంలో సర్వేలు ఆపాలంటూ ఓ వైపు బాధితులు ఆందోళన చేస్తుంటే సర్కారు మాత్రం మొండిగా ముందుకు వెళ్తోంది. కోర్టు ఆదేశాలను సైతం లెక్క చేయడం లేదు. తాజాగా ఈ అంశంపై మంత్రి కోమటిరెడ్డి స్పందించారు. మానవత్వం ఉన్న మనుషులైతే మూసీ ప్రక్షాళనకు మద్దతు ఇస్తారని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. మూసి నరకం నుంచి నల్గొండ జిల్లా ప్రజలకు విముక్తి కలుగుతుందన్నారు. మూసి పరివాహక ప్రాంతాల్లో పండే పంటలో ఐరన్ ఎక్కువ అని ప్రియాంకా వర్గీస్ స్టడీ రిపోర్ట్ ఇచ్చారన్నారు. ఓ వైపు ఫ్లోరిన్.. ఇంకో వైపు మూసి అంటూ మంత్రి తెలిపారు. నల్గొండ అంటే కేటీఆర్‌కు ఎందుకు అంత కోపమని ప్రశ్నించారు. మల్లన్న సాగర్ లో పోలీసులను పెట్టి రైతులను ఖాళీ చేయించిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని చెప్పారు.



## హైదరాబాద్‌లో డీజేలు బంద్

- పోలీస్ కమిషనర్ కీలక నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన కమిషనర్

**హైదరాబాద్:** నగర సీపీ సీవీ ఆనంద్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఇక నుంచి హైదరాబాద్ లో డీజేలు బంద్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. డీజేలు బంద్ చేయాలా? వద్దా? అన్న విషయంపై ఇటీవల పలు మతాలకు సంబంధించిన ప్రతినిధులతో సీపీ సమావేశమైన విషయం తెలిసిందే. కాగా తాజాగా ఆయన కీలక నిర్ణయం తీసుకున్నారు. ఊరేగింపులు, వేడుకల సందర్భంగా విపరీత శబ్ద కాలుష్యానికి దారితీస్తున్న డీజేలపై నిషేధం విధించారు. డీజే సౌండ్ కారణంగా ఇబ్బందులు పడుతున్నామని డయిల్ 100కు ఫిర్యాదులు పెరగడంతో డీజేలపై నిషేధం విధిస్తూ పోలీసు శాఖ నిర్ణయం తీసుకుంది. ఇక నిబంధనలు ఉల్లంఘిస్తే ఇక నుంచి చర్యలు తీసుకుంటామన్నారు.



## కాలి నడకన తిరుమలకు డిప్యూటీ సీఎం పవన్

**ఏపీ బ్యూరో** : తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వివాదంతో ఇటీవల ప్రాయిశ్చిత్త దీక్ష చేపట్టిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దీక్ష విరమణ కోసం నేడు తిరుమలకు బయలు దేరారు. అలిపిరి మెట్ల మార్గం పాదాల మండపం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాలి నడకన కొండపైకి బయలుదేరారు. దీక్ష విరమణకు కూటమి నేతలు, జనసేన కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం స్వామి వారి దర్శన అనంతరం ప్రాయశ్చిత్త దీక్ష విరమించనున్నారు.



# ఆక్రమణల కూల్చివేత

- రామమ్మకుంట చెరువు బఫర్ జోన్‌లో కొత్త భవన నిర్మాణం
- నిథిమ్ యాజమాన్యం భవనాన్ని కూల్చివేసిన అధికారులు



**శేరిలింగంపల్లి** : గచ్చిబౌలి రామమ్మ కుంట చెరువులో వెలిసిన ఆక్రమణలను మంగళవారం కూల్చివేశారు. శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి సర్వేనెంబర్ 71లో మూడెకరాల విస్తీర్ణంలో రామమ్మకుంట చెరువు విస్తరించి ఉంది. గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (నిథిమ్)లో గతంలో చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. చెరువు చుట్టూ నిథిమ్ క్యాంపస్ విస్తరించి ఉండగా, కొన్నేండ్ల క్రితం నిథిమ్ యాజమాన్యం చెరువు బఫర్ జోన్‌లో కొత్త భవన నిర్మాణం ప్రారంభించింది. చెరువును పూడ్చి భవన నిర్మాణం చేపట్టడంపై పలు స్వచ్ఛంద సంస్థలు, హెచ్ఆర్సీసీ కోర్టును ఆశ్రయించాయి. దీంతో వివాదం కోర్టుకు చేరగా.. భవన నిర్మాణం మధ్యలో నిలిచిపోయింది. కొన్ని రోజుల క్రితం హైకోర్టు సదరు భవనాన్ని తొలగించాలని ఆదేశాలు ఇవ్వడంతో నిథిమ్ యాజమాన్యం భవనం కూల్చివేత పనులు మంగళవారం చేపట్టింది.



## బీసీ వసతి గృహం తనిఖీ

**పెద్దపల్లి** : పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని రంగంపల్లిలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహాన్ని సోమవారం రాత్రి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, భోజనం నాణ్యత మొదలగు వివరాలను కలెక్టర్ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో ఉంటున్నారా.. ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా.. పారిశుధ్యం బాగా ఉందా.. స్టడీ అవర్స్ జరుగుతున్నాయా వంటి అంశాలను ఆరా తీసిన కలెక్టర్ వసతి గృహం పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. తనిఖీల్లో కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఉద్యోగ విరమణ అనివార్యం

- అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ

**కరీంనగర్ టౌన్** : ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనివార్యమని, ఎన్నో సవాళ్లతో కూడుకొన్న పోలీసు ఉద్యోగం సంపూర్ణంగా చేయడం హర్షనీయమని అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ అన్నారు. కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో పదవీకాలం ముగిసిన ఏఎస్సైలు మహమ్మద్ యూసుఫ్ షరీఫ్, బీ.మల్లయ్య, ఎం.లక్ష్మయ్యను కమిషనరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంతకాలం సేవలందించగలిగారంటే కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంటుందని, పదవి విరమణ పొందిన అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజర్వు ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి (సంక్షేమం), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్సై మామిడి సురేందర్, రిజర్వు ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.



## సీసీరోడ్డు పనులు ప్రారంభం

**చేర్యాల టౌన్** : చేర్యాల మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు లోని శ్రీనగర్ కాలనీలో రూ.5లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్ రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్ రెడ్డి, కౌన్సిలర్లు చంటి, సతీష్, నరేందర్, నాయకులు నాగేశ్వర్‌రావు, 4వ వార్డు అధ్యక్షుడు బాగయ్య, కార్యదర్శి తిరుపతిరెడ్డి, కాలనీ సభ్యులు తుపాకుల బాబు, రాజు, శ్రీధర్, మల్లారెడ్డి, రమేష్, లత, మమత, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



## పాఠశాలల్లో ముందస్తుగా బతుకమ్మ సంబురాలు

- ఆడిపాడిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

**నార్నూర్/గాదిగూడ** : ఉమ్మడి మండలాలైన నార్నూర్, గాదిగూడలోని తదితర గ్రామాల్లో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులు వివిధ రకాల పువ్వులతో బతుకమ్మలు తయారుచేసి ఆడిపాడారు. అనంతరం సమీపంలోని చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చౌహాన్ వందన, హెచ్ డబ్ల్యూవో పవర్ అనిత, విట్టల్, జాదవ్ ఉమాజీ, మనోహర్ మానే, వామన్ రావు, సుభాష్, సూర్యవంశీ పాల్గొన్నారు.

## సుల్తానాబాద్‌లో బిరుదు రాజమల్లు విగ్రహం ఏర్పాటు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు
- ఘనంగా మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు 74వ జయంతి
- నివాళులర్పించిన ఎమ్మెల్యే
- పారిశుధ్య సిబ్బందికి దుస్తువుల పంపిణీ



**పెద్దపల్లి** : పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బిరుదు రాజమల్లు 74వ జయంతిని సుల్తానాబాద్ పట్టణంలో మంగళవారం నిర్వహించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు రాజమల్లు నివాసంలో వారి కుటుంబ సభ్యులతో కలిసి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా 55 మంది మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి దుస్తులు, చీరలను ఎమ్మెల్యే కుటుంబ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సుదీర్ఘకాలం పాటు ప్రజలకు సేవలు అందించిన రాజమల్లు విగ్రహాన్ని సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఎల్ఎంబీ బ్యాంకు చైర్మన్‌గా, సర్పంచ్, ఎంపీపీగా, ఎమ్మెల్యేగా, జిల్లా టీడీపీ పార్టీ అధ్యక్షుడిగా రాజమల్లు సేవలందించి ప్రజల హృదయంలో చెరగని ముద్ర వేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం కృషి చేస్తామన్నారు. రాజమల్లు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో రాజమల్లు సతీమణి బిరుదు సుశీల, బిరుదు కుటుంబ సభ్యులు, మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పెద్దపల్లి మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఈర్ల స్వరూప, కౌన్సిలర్లు, పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అత్యాచార నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలి

- కురుమ యువ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షుడు గొరిగే నరసింహ
- కురుమ సంఘం ఆధ్వర్యంలో చేర్యాలలో రాస్తారోకో

**చేర్యాల టౌన్** : చేర్యాల పట్టణం లోని గాంధీ సెంటర్ లో మంగళవారం కురుమ సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. రెండు రోజుల క్రితం కొమురవెల్లి మండలంలోని గురువన్నపేట గ్రామంలో కురుమ సామాజిక వర్గానికి చెందిన మైనర్ బాలికను అత్యాచారం చేసిన నిందితుడిని ఎన్‌కౌంటర్ చేయాలని కురుమ యువ చైతన్య సమితి కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గొరిగి నర్సింహా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ట్రాఫిక్ నిలిచిపోవడంతో పోలీసులు ఆందోళనకారులను శాంతింపజేయడంతో ధర్నా విరమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం గురువన్నపేట గ్రామంలో కురుమ సామాజిక వర్గానికి చెందిన 7వ తరగతి చదువుతున్న మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన 22 ఏళ్ల ముస్లిం యువకుడు అత్యాచారం చేయడం సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. కేసును నీరుగార్చకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా యుద్ధ ప్రాతిపదికన విచారణ చేపట్టి, నిందితుడిని బహిరంగంగా ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే కురుమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేవైసీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీస పార్వతీసత్యనారాయణ, కురుమ సంఘం రాష్ట్ర నాయకులు అందె బీరయ్య, జయ మల్లేశం, నియోజకవర్గ అధ్యక్షుడు ఓరుగంటి శంకర్, కేవైసీఎస్ జిల్లా అధ్యక్షుడు గౌడ రాజ్ కుమార్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అందె నాని బాబు, కేవైసీఎస్ రాష్ట్ర నాయకుడు అందే అశోక్, ఒగ్గు మల్లేశం, ఒగ్గు రాజు, జంగిలి యాదగిరి, బైకని కమలాకర్, కామల్ల అనిల్ కుమార్, కురుమ సంఘం సీనియర్ జిల్లా నాయకుడు ఈరి భూమయ్య, బండారి సతీష్, దయ్యాల రాజు, మీస చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.



## పాఠశాలలో బతుకమ్మ సంబురాలు

- బతుకమ్మ పుస్తక రచయితకు ఘన సన్మానం

**చేర్యాల టౌన్** : చేర్యాల మండలంలోని అర్జునపట్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. బతుకమ్మ ప్రకృతి పండుగ అని బతుకమ్మ పుస్తక రచయిత టి.విష్ణుమూర్తి అన్నారు. అర్జునపట్ల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు బతుకమ్మలను ఒకచోట పెట్టి ఆడిపాడారు. అనంతరం రచయిత విష్ణుమూర్తిని సన్మానించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెట్రోరైలు పెయిడ్ పార్కింగ్‌ను విరమించుకోవాలి

- ఏఐఎఫ్‌డీవై ఆధ్వర్యంలో మెట్రో రైలు ఎండీకి వినతిపత్రం



**శేరిలింగంపల్లి** : మియాపూర్, నాగోల్ మెట్రో రైలు స్టేషన్లల్లో పెయిడ్ పార్కింగ్ అమలు విధానాన్ని రద్దు చేయాలని ఏఐఎఫ్‌డీవై డిమాండ్ చేసింది. మంగళవారం బేగంపేటలోని మెట్రో రైలు భవన్‌లో హైదరాబాద్ మెట్రో రైలు మేనేజింగ్ డైరెక్టర్ ఎన్‌వీఎస్ రెడ్డికి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ డి.మధుసూదన్ మాట్లాడుతూ.. ఈ నెల 6నుంచి మియాపూర్, నాగోల్ మెట్రో రైలు స్టేషన్లల్లో పెయిడ్ పార్కింగ్ విధానాన్ని తీసుకురావాలని ఎల్అండ్‌టీ, హైదరాబాద్ మెట్రో రైలు విభాగాలు చేసిన నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వివిధ రూపాల్లో ప్రయాణికులకు అందిస్తున్న స్కీములు పొడిగిస్తున్నామని చెబుతూనే మరోపక్క మెట్రో ఛార్జీలను పెంచడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. మెట్రో రవాణా చార్జీల భారాన్ని, వాహనాల పార్కింగ్ చార్జీల భారంతో వాహనదారులు ప్రయాణికులు ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. ఇప్పటివరకు ఉన్న పార్కింగ్ స్థలాల్లో వాహనాలకు భద్రతా లేకపోవడం, సరైన సౌకర్యాలు కల్పించకపోవడం లాంటివి ఎదురవుతున్న తరుణంలో ప్రయాణికుల నుంచి పార్కింగ్ ఛార్జీలు వసూలు చేయడానికి ఎల్ అండ్‌టీ హైదరాబాద్ మెట్రో రైలు సంస్థలు చేస్తున్న ప్రణాళికను విరమించుకోవాలని ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ హైదరాబాద్ కమిటీ డిమాండ్ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీవై గ్రేటర్ హైదరాబాద్ కమిటీ సభ్యులు ఈ.దశరథ్ నాయక్, డి. శ్రీనివాసులు, తేజ పాల్గొన్నారు.

## గ్రామ బహిష్కరణ

- ఆస్తి పంపకాల్లో చెప్పినమాట వినలేదని..
- దంపతుల ఆత్మహత్యాయత్నం

**తెలంగాణ బ్యూరో** : ఆస్తి పంపకాల్లో చెప్పినమాట వినలేదని గ్రామ బహిష్కరణ చేయడంతో దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన యాదాద్రి భువనగిరి రామన్నపేట్ మండలం మునిపంపుల గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆస్తి పంపకాల్లో గ్రామపెద్దలు చెప్పినట్లు వినకపోవడంతో రమేశ్, వసంత దంపతులను గ్రామ బహిష్కరణ, కుల బహిష్కరణ చేశారు. దీంతో మనస్తాపానికి గురైన బాధితులు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన స్థానికులు వెంటనే దవాఖానకు తరలించారు. ఇటీవల తాటిచెట్ల పంపకాల్లో కూడా గ్రామ బహిష్కరణ పేరుతో అన్యాయం చేశారని రమేశ్ వాపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## మున్నేరు వంతెన పైనుంచి దూకిన వ్యక్తి

- దవాఖానకు తరలించిన ట్రాఫిక్ పోలీసులు

**ఖమ్మం** : ఖమ్మం రూరల్ మండలం రాజీవ్ గృహ కల్ప ప్రాంతానికి చెందిన పారుపల్లు ఉమేశ్ (22), అనే వ్యక్తి వ్యక్తిగత కారణాలతో జీవితంపై విరక్తి చెంది నగరంలోని కరుణగిరి మున్నేరు వంతెన పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మున్నేరు నీటి నుంచి ఈత కొట్టుకుంటూ కాలుకు తగిలిన గాయలతో బయటకు వచ్చాడు. అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి స్థానికులు సమాచారం ఇవ్వడంతో గాయపడిన వ్యక్తిని ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఓ హోటల్‌లో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం.



## 'ఉత్తమ్'కు వెలిచాల పరామర్శ

**కరీంనగర్** : రాష్ట్ర నీటిపారుదల, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని మంగళవారం కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు పరామర్శించారు. ఉత్తమ్‌కుమార్ తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల మరణించగా, హైదరాబాద్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన వెలిచాల కుటుంబ సభ్యులతో రాజేందర్ రావు మాట్లాడారు. పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. మంత్రి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని వేడుకున్నారు. ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ది అసమర్థ పాలన

- ఖానాపూర్‌లో మార్కింగ్ కోసం వెళ్లిన రెవెన్యూ అధికారులు
- అడ్డుకున్న స్థానికులు

**తెలంగాణ బ్యూరో** : కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై ప్రజలు తిరగబడుతున్నారు. అసమర్థ పాలన, ముందుచూపులేని నిర్ణయాలపై ఎక్కడిక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులను అడ్డుకుంటున్నారు. తాజాగా హైడ్రా తరహాలో ఆదిలాబాద్ జిల్లాలో కూల్చివేతలకు రంగం సిద్ధం చేసేందుకు వెళ్లిన అధికారులను ప్రజలు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల్లోని ఇండ్ల మార్కింగ్ కోసం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు వెళ్లారు. ఎన్నో ఏండ్లుగా ఉంటున్న తమ ఇండ్లు కూల్చవద్దంటూ స్థానికులు ఆందోళనకు దిగారు. మార్కింగ్ చేయకుండా అధికారులను అడ్డుకున్నారు. దీంతో చేసేదేమిలేక అధికారులు అక్కడ నుంచి వెనుదిరిగారు.



## గుండెపోటుతో టీపీసీసీ అధికార ప్రతినిధి మృతి

**మహబూబాబాద్** : మహబూబాబాద్ టీపీసీసీ అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్ గుండెపోటుతో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. న్యాయవాదిగా, పాత్రికేయులుగా, రాజకీయనాయకుడిగా ఆయనకు ప్రజలతో మంచి సంబంధాలున్నాయి. ఆయన మృతికి అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు తమ సంతాపాన్ని తెలిపారు.

### పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసనమండలి

## ఎన్నికల దరఖాస్తుల ఆహ్వానం



**జుక్కల్** : జుక్కల్ నియోజకవర్గం మద్నూర్ మండలం మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి ఎన్నికల కోసం అర్హతగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మద్నూర్ తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. 2021వరకు ఏదేని డిగ్రీ పాసైన అభ్యర్థులు, అప్పటికే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న టీచర్లు అర్హులని తెలిపారు. దరఖాస్తులను మద్నూర్ తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని, ఆన్‌లైన్ ceotelangana.nic.inలో అప్లై చేసుకోవాలని సూచించారు.

## జిల్లా కోర్ట్ ఆవరణలో స్వచ్ భారత్ కార్యక్రమం

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా**

కాప్రా, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ రాష్ట్ర హై కోర్ట్ వారి ఆదేశాల మేరకు గత నెల 23 నుండి అక్టోబర్ 01 వ తేది వరకు స్వభావ స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత భాగంగా స్వచ్ఛత సేవ కాంపెయిన్ స్వచ్ భరత్ క్యాంపు ని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జడ్జి వి. బాల భాస్కర్ రావు మంగళవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కోర్టు ఆవరణ లో స్వచ్ భరత్ దినోత్సవం జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయ మూర్తి ఆర్ రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి డి.కిరణ్ కుమార్,రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి మహేష్ నాథ్,మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. అరుణ్ తేజ్,మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి చిరాగ్ మెహతా,బార్ ప్రెసిడెంట్ అమరేందర్ రెడ్డి,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీన్ గ్రోవ్ లో బతుకమ్మ వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో బతుకమ్మ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్ పర్సన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలు జరుపుకునే పూల పండుగ బతుకమ్మను చిన్నారి విద్యార్థినిలు నిర్వహించారన్నారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలతో ఆడి పాడారు. చిన్నారి విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయమైన దుస్తులతో విచ్చేసి ఉత్సాహంతో పాల్గొన్నారు. ప్రకృతి పూలను పూజించే పండుగ బతుకమ్మను తెలంగాణ ప్రజలంతా ఆనంద ఉత్సవాలతో ఈ సంవత్సరం కూడా నిర్వహించుకోవాలన్నారు. పాఠశాల డైరెక్టర్ ఎస్ లక్ష్మి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ఉపాధ్యాయురాళ్లు చక్కని పాటలతో బతుకమ్మ లాడారు దీంతో పాఠశాల వాతావరణం అంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేశారు.

## డాక్టర్ జి. నాగేశ్వరావుకు లైఫ్ టైమ్ అచీవ్మెంట్ అవార్డు



కాప్రా ప్రజాస్ఫూర్తి: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా రవీంద్రభారతిలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కాప్రా లోని ఈశ్వరపురి కి చెందిన తెలంగాణ వయోవృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర కమిటీ సభ్యులు, జీహెచ్ఎంసీ ఆసరా సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ జి .నాగేశ్వరావు లైఫ్టమ్ ఆచీవ్మెంట్ అవార్డును అందుకున్నారు.గత దశాభాన్నార కాలంగా రాష్ట్రంలో వయోవృద్ధుల సంక్షేమం కోసం ఆయన కృషి చేశారు.ఆయన చేసిన సేవలకు గుర్తించిన ప్రభుత్యం రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా ఆయన విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మాజీ ఎమ్మెల్యే ఉచ్చిడి మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రైతు హామీల సాధనా దీక్ష విరమించిన మల్కాజ్గిరి ఎంపి ఈటెల రాజేందర్



కాప్రా, ప్రజాస్ఫూర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ధర్నా చౌక్ ఇందిరాపార్క్ దగ్గర మల్కాజ్గిరి మేడ్చల్ ఎంపీ ఈటెల రాజేందర్ 24 గంటల నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో తెలంగాణ రాష్ట్ర ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, కిసాన్ మోర్చా నాయకులు, బిజెపి రాష్ట్ర పదాధికారులు, నాయకులు , రైతులు పాల్గొన్నారు.24 గంటల రైతు సాధన దీక్షలో కూర్చొని మంగళవారం దీక్ష విరమించిన మల్కాజ్గిరి పార్లమెంట్ సభ్యులు మాజీ మంత్రి ఈటల రాజేందర్ ని ఉప్పల్ మాజీ శాసనసభ్యులు బేతి సుభాష్ రెడ్డి,సమక్షంలో సన్మానించిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు మర్రి మోహన్ రెడ్డీ,డివిజన్ అధ్యక్షుడు రమేష్ యాదవ్, ఏనుగు సీతారాంరెడ్డి,కృష్ణారెడ్డి, ఘట్కేసర్ ఎంపీపీ మేడ్చల్ బిజెపి పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఏనుగు సుదర్శన్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా డిజిటల్ కార్డుకై వివరాలు సేకరించాలి

* **ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలి**
* **డబుల్ బెడ్ రూం ఇండ్లు పంపిణీ చేయాలి**
* **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్**
* **పాల్గొన్న అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**






ప్రజాస్ఫూర్తి, సిరిసిల్ల : పక్కాగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు సేకరించాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, రెండు పడక గదులు, కొనుగోలు కేంద్రాల ఏర్పాటు అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లతో మంత్రి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం నిర్వహించారు. కాగా ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సిరిసిల్ల జిల్లా నుంచి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ హాజరయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడారు. ఈ నెల 3వ తేదీ నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలోని ఒక మున్సిపల్, గ్రామంలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని, దీనికి నోడల్ ఆఫీసర్ ను నియమించాలని సూచించారు. సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు తీసుకొని ఎంట్రీ చేయాలని ఆదేశించారు. ఈ నెల 8 వ తేదీ వరకు ఇది పూర్తి చేయాలని, 9 వ తేదీ స్క్రూటినీ ఉంటుందని, 10 వ తేదీన రిపోర్ట్ సబ్మిషన్ ఉంటుందని తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టు ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా మిగితా సర్వే పనులపై ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. అనంతరం ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులు ఏ ఏ జిల్లాలో ఎన్ని ఉన్నాయి? ఎన్ని పూర్తి చేశారో అడిగి తెలుసుకున్నారు. ఆయా దరఖాస్తులు నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని రెండు పడక గదులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయో వివరాలు తెలుసుకున్నారు. ఇంకా ఏమైనా పనులు చేయాల్సి ఉంటే వెంటనే పూర్తి చేసి, త్వరలో పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. సన్న వడ్లకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు రూ. 500 అదనంగా అందజేయనుందని తెలిపారు. సన్న, దొడ్డు వడ్ల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సన్న వడ్ల లో దొడ్డు వడ్లు కలవకుండా చూసుకోవాలని, వ్యవసాయ అధికారి పరిశీలించిన తర్వాత వాటిని పంపాలని పేర్కొన్నారు. రైతులకు ఏ ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని మంత్రి, సీఎస్ ఆదేశించారు. ఈ సమావేశం లో సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రమేష్, రాజేశ్వర్, డీఆర్డీఓ శేషాద్రి, మున్సిపల్ కమిషనర్లు మీర్జా ఫసహత్ అలీ బేగ్, సంపత్ రెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, డీటీసీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ కు మెట్రో సేవలను విస్తరించాలి

* **మెట్రో ఎండి ఎన్వీఎస్ రెడ్డి గారికి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే**



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్:శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరానికి మణిహారంగా మహానగర ప్రజలకు తన సేవలను అందిస్తున్న హైదరాబాద్ మెట్రో రైల్ (హెచ్ఎంఆర్) ఫేజ్ 2 లో కుత్బుల్లాపూర్ కు మెట్రో సేవలను విస్తరించాలని కోరుతూ ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ బేగంపేట్ లోని హైదరాబాద్ మెట్రో రైల్ భవన్ లో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ఎంతోమంది ప్రయాణికులను వారి గమ్య స్థానాలకు చేర్చుతూ దేశంలోనే మూడవ అతి పెద్ద మెట్రో రైల్ సంస్థగా నిలిచిన హైదరాబాద్ మెట్రో రైల్ ను విస్తరించాలని భావిస్తున్న ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తూ, మెట్రో రైల్ ఫేజ్ 2 విస్తరణలో కుత్బుల్లాపూర్ ప్రాంతాన్ని ప్రాధాన్యతను ఇవ్వాలని కోరాడు. భాగ్యనగరానికి ఉత్తర దిక్కున అతివేగంగా అభివృద్ధి చెందుతున్న కుత్బుల్లాపూర్ ప్రాంతం నుంచి లక్షలాదిమంది ఉద్యోగులు నగరంలోని వివిధ ప్రాంతాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని కుత్బుల్లాపూర్ సుచిత్ర కొంపల్లి ప్రాంతాలతో పాటు ఐడీపీఎల్ చింతల్ షాపూర్ నగర్ జీడిమెట్ల సూరారం దుండిగల్ ప్రాంతాల నుంచి నిత్యం లక్షలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారని అన్నాడు. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణలో భాగంగా రూట్ 1: గండి మైసమ్మ నుంచి సూరారం జీడిమెట్ల షాపూర్ నగర్ చింతల్ బాలానగర్ చౌరస్తా మీదుగా భరత్ నగర్ మెట్రో స్టేషన్ వరకు, రూట్ 2 : మేడ్చల్ నుంచి కొంపల్లి సుచిత్ర బోయిన్ పల్లి మీదుగా సికింద్రాబాద్ కు మెట్రో రైల్ ను ఏర్పాటు చేస్తూ నూతన మెట్రో లైన్ లను ఏర్పాటుచేయాలని కోరాడు. హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణలో భాగంగా కుత్బుల్లాపూర్ కు మెట్రో రైల్ విస్తరణ ను చేపట్టి ప్రజలు సుదూర ప్రాంతాలకు వేగంగా చేరుకునేలా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నాడు.మెట్రో ఎండీ ని కలిసి వారిలో దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నాగరాజు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని వినతి

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి:చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం బ్రహ్మంగారి గుడి ప్రహరీ గోడ ప్రక్కన కొంత మంది గది నిర్మాణం చేసినారని, దాని వలన అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారే అవకాశం ఉన్నదని, ఈ అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని కోరుతూ మంగళవారం చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రాన్ని తంగడిపల్లి గ్రామవాసులు అందజేశారు. రోడ్డును ఆక్రమించి గదిని నిర్మాణం చేయడం వలన ఆ రోడ్డుపై రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. వేణుగోపాల స్వామి, బ్రహ్మంగారి దేవాలయాలకు వచ్చే మహిళ భక్తులకు భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నదని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున అనుమతులు లేకుండా రోడ్డును ఆక్రమించి నిర్మించిన గదిని వెంటనే తొలగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో గోవిందా చారి, శ్రీనివాస్ చారి, కృపాచారి, మాధవాచారి అనంత చారి వెంకటాచారి, ఓంకారాచారి, పోలోజు పరిపూర్ణాచారి తదితరులు పాల్గొన్నారు

## నారాయణ పాఠశాలలో కనుల పండుగగా ముందస్తు బతుకమ్మ వేడుకలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: స్థానిక నెహ్రూనగర్ నారాయణ పాఠశాలలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం తెలంగాణలో విశిష్టమైన పండుగ బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ ఆట పాటలతో విద్యార్థినులు, టీచర్స్ మొదటగా దుర్గా దేవికి పూజలు నిర్వహించి, గౌరమ్మను ప్రతిష్ఠించి, . తంగేడు, గునుగు, బంతి, చేమంతి, కట్ల, సంపెంగ, మొల్ల, సీత జడలు, రుద్రాక్ష, పోక బంతి, మల్లె, మందార, మరువం, పారిజాతం, కమలం, తామర, గన్నేరు గుమ్మడి, గులాబీ, పట్టుకుచ్చులు పూలతో చక్కగా బతుకమ్మలను పేర్చి విద్యార్థినులు బతుకమ్మ సంబరాలను సాంప్రదాయ దుస్తులలో పాల్గొని, బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేసారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పూరేటి నరసింహారావు, ఈ చాంప్స్ కోఆర్డినేటర్ వినోద లక్ష్మి, ఈ టెక్నో అకాడమిక్ డీన్ డి.రామకృష్ణ, ఈ చాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ రుచిత శ్రీ , ఈ కిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ పద్మ, 10వ తరగతి ఇంచార్జి కొమ్ము మల్లేష్, ఉపాధ్యాయులు కె.సుజిత్, కె.అనూష, శ్వేత, ఎన్.సురేష్, బి.మంగ్యా, పి.రమేష్ బాబు, దీప్తి, శైలజ, కళ్యాణి, రహీమా, నాగూర్ బీ, శ్రీలత, జాహ్నవి, అలియా, నాగరాణి, అఫ్రీన్, జి.అనూష, నిఖిల, కావ్య, సరిత, స్రవంతి, స్వాతి, గోవర్ధన్, పీఈటి వినయ్ , పాఠశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## ప్లే స్కూల్ ప్రారంబోత్సవం చేసిన పత్తి కుమార్



కాప్రా ప్రజాస్ఫూర్తి : కాప్రా లో బి వి ఎన్ లిటిల్ చాంప్స్ ప్లే స్కూల్ చైర్మన్ మురళీ కృష్ణ డైరక్టర్లు ఎండీ రెహమాన్ శ్రీనివాస్ రావు పిలుపుమెరకు పాల్గోని ప్రారంబోత్సవం చేసిన మేడ్చల్ జిల్లా ఎస్సీ సెల్ అద్యక్షులు పత్తి కుమార్ ఈకార్యక్రమంలో సతీష్ యాదవ్ లక్ష్మి సాయి లు పాల్గొన్నారు. ఈసందర్బంగా పత్తి కుమార్ మాట్లాడుతు చిన్నపిల్లలు ఎధుగే క్రమంలో ప్లే స్కూల్ చాల వరకు ఉపయోగ పడుతాయి అని అన్నారు

## లింగోజిగూడెం జడ్పీహెచ్ఎస్ లో బతుకమ్మ వేడుకలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధి లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ముందుగానే దసరా పండుగ వాతావరణం నెలకొంది. పాఠశాలలో సాంస్కృతిక పాటలతోటి ఆటలతోటి సాంప్రదాయక దుస్తులతోటి ఎంతో చక్కగా అలంకరించుకొని విద్యార్థులు మంగళవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మ పాటలతోటి పాఠశాల దద్దరిలేటట్టు గాండీవం, బతుకమ్మ నృత్యం చేస్తూ బతుకమ్మ పాటల తోటి ఎంతో చక్కగా నిరాడంబరంగా జరుపుకున్నారు. ముందుగానే మన విజయదశమి పండగ వచ్చిందా అనిపించే విధంగా మన ఆడపిల్లలు చక్కగా అలంకరించుకొని తమ యొక్క ఆటలతో పాటలతో ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను విద్యార్థులను మెచ్చుకునే విధంగా తమ యొక్క నృత్య ప్రదర్శన చేశారు. ఇటువైపు ఉపాధ్యాయుల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో, పిల్లల తోటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలు నవ్వుతూ పాడుతూ నృత్యాలతో దసరా పండగ పండగను ముందుగానే వచ్చింది అనే విధంగా నృత్యం చేసి అందర్నీ అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కురెళ్ళ శ్రీనివాసులు, మాధవ రెడ్డి, అరుణ పురుషోత్తమ చారి, విజయ లక్ష్మి, రమేష్ రెడ్డి అనిల్ కుమార్ రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఆర్ కాలేజీలో ఘనంగా బతుకమ్మ ఉత్సవాలు



ప్రజాస్ఫూర్తి, నల్లగొండ : బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని స్థానిక చర్లపల్లి లో గల ఎస్ఆర్ స్కూల్ మరియు కాలేజీ లోఘనంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. సందర్భంగా జోనల్ ఇన్చార్జి దోనాల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాలు తెలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇంచార్జి డి. శ్రీనివాస రెడ్డి అసిస్టెంట్ జోనల్ సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ రావు, రాజశేఖర్ రెడ్డి, కమలాకర్, ఉపాధ్యాయులు , ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణిలో అంబరానంటిన బతుకమ్మ సంబరాలు



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రం అంజన సాయి మెడోస్ లోని కృష్ణవేణిటాలెంట్ స్కూల్ లో అట్టహాసంగా బతుకమ్మ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గుత్త కవిత గోపాల్ రెడ్డి మాట్లాడుతూ. అందరికీ ముందుగా విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినిలు సాంప్రదాయక దుస్తులు ధరించి, వివిధ రకాల పువ్వులని తెచ్చి స్వయంగా బతుకమ్మ నీ పేర్చి తెలుగు వారి సంప్రదాయాన్ని ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉయ్యాల రమేష్, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వివేకానంద నగర్ డివిజన్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**జీహెచ్ఎంసీ కమిషనర్కు వినతి**




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : శేరిలింగం పల్లి నియోజకవర్గం వివేకానంద నగర్ డివిజన్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో కలిసి స్థానిక కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు మంగళవారం జిహెచ్ఎంసి కమిషనర్ కాటా ఆమ్రపాలి ని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్లోని పలు ప్రాంతాలలో స్ట్రీట్ లైట్స్ రిపేర్లు చాలా ఉన్నాయని, అలాగే అమర్చిన లైట్లలో 2530% సీట్ లైట్స్ కానీ టైమర్స్ కానీ పనిచేయటం లేవన్నారు. పాడైపోయిన రోడ్లలో సిమెంట్ రోడ్లు, వినాయక పార్క్ వివేకానంద కాలనీ, ఎస్ రాజు నగర్ కాలనీ లలో ఓ పెన్ జిమ్ము మంజూరు చేయాలని కోరారు. దీంతో కమిషనర్ సమస్యలపై సానుకూలంగా స్పందించి వీలైనంత తొందరగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు

## ప్రశాంతంగా దేవీ నవరాత్రుత్సవాలు జరిగేలా సహకరించాలి

**- ముస్తాబాద్ ఎస్ఐ గణేష్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ప్రశాంతం వాతావరణంలో దేవీ నవరాత్రుత్సవాలు జరిగేలా ప్రతీ ఒక్కరూ సహకరించాలని ముస్తాబాద్ ఎస్ఐ గణేష్ అన్నారు. ముస్తాబాద్ మండలంలో ఏర్పాటు చేసిన దుర్గామాత దేవి మండపాల నిర్వహకులతో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్లో ఎస్ఐ గణేష్ మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వహకులు తూచా తప్పకుండా నియమ, నిబంధనలను పాటించాలని సూచించారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని తెలిపారు. దుర్గామాత నిమజ్జన సమయంలో ఎవరూ కూడా డిజె సౌండ్లను వినియోగించరాదని సూచించారు. తగిన జాగ్రత్తలు పాటిస్తూ నిమజ్జన వేడుకలను కూడా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, మండపాల నిర్వహకులున్నారు.

## బాలల లైంగిక వేధింపుల నివారణపై అవగాహన




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలంలోని నామాపూర్ టిఎస్ ఎంస్ స్కూల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీ, టిఎస్‌డబ్ల్యూఆర్ఐఇఎస్‌లో బాలల లైంగిక వేధింపుల నివారణ అవగాహన సదస్సును షీటీం, జిల్లా శ్రీ శిశు సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. షీటీం ఎఎస్ఐ ప్రమీల, ప్రియాంక, వీరయ్య, ఐసిపిఎస్ విజయ్ కుమార్‌లు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. పోక్సో చట్టం గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఎవరైనా బాలికలను, మహిళలను వేధింపులకు గురి చేస్తే 100 లేదా 1098, లేకపోతే 8712656425కి సమాచారం ఇవ్వాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులున్నారు.

## శ్రీ ఎస్పిఆర్ గ్లోబల్ పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



ప్రజాస్ఫూర్తి,కుత్బుల్లాపూర్:గాజులరామారం లో డివిజన్ లోని చిత్తారమ్మ దేవి నగర్ లో శ్రీ ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ లో బతకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఎస్ పి ఆర్ గ్లోబల్ స్కూల్ చైర్మన్ మ, టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి ముఖ్య అతిధిగా హజరయ్యారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండగ,దసరాకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేశారు.ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు , ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# మూసీ నది ప్రక్షాలనతో పాటు మంజీరా నదిని పరిరక్షించాలి

* **హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టుశ్రీధర్**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : మూసీనది పక్షాలనతో పాటు గోదావరి ఉపనది అయినటువంటి మంజీరా నదిని కాలుష్యం బారినుండి రక్షించాలని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు మెట్టుశ్రీధర్ డిమాండ్ చేశారు. స్వచ్ఛ భారత్ పేరుతో కేంద్రప్రభుత్వం గాంధీజయంతి రోజున పరిసరాలశుభ్రత కార్యక్రమాలు నిర్వహించడం ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. భావితరాలకు సాగుకు తాగుకు ఉపయోగపడే మంజీరా నది హైదరాబాద్ నుండి నాలాల ద్వారావచ్చే నీరు , కంపేనీలు విడుదలచేసే రసాయనాలు నక్కవాగుద్వారా ఇస్మాయిల్ ఖాన్ పేట్ పరిసరప్రాంతంలో మంజీరా నదిలో కలవడం జరుగుతుందని తెలిపారు. ఈ నీరు చివరకు కామారెడ్డి జిల్లాపరిధిలోని నిజాం సాగర్లో కలుస్తుందన్నారు. ఈ నదిని రక్షించుకోకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకమే అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని కుంటలు చెరువులు రక్షించాలని ప్రభుత్వం హైడ్రా సంస్థను ఏర్పాటు చేసిందని , మూసీ నది సుందరీకరణ కోసం లక్షల కోట్లు వెచ్చిస్తుందని హైదరాబాదుకు కూతవేటు దూరంలో ఉండి సాగు తాగునీటిని అందించే మంజీరా నది కాలుష్యం పై ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుని కాలుష్యం భారి నుండి మంజీరా నదిని రక్షించుకోవాల్సిన భాధ్యత ప్రభుత్వంతో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా వాసులపై ఉందన్నారు. ప్రభుత్వం స్పందిచకపోతే తాను గ్రీన్ ట్రిబ్యునల్ ను ఆశ్రయించనునంట్లు మెట్టుశ్రీధర్ తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21జీవితం మరియు వ్యక్తిగత స్వేచ్ఛ అనే ప్రాథమిక హక్కు ప్రకారం కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కాలుష్యంలేనటువంటి పరిసరాలను అందిచాలని నీటి కాలుష్యనివారణ చట్టం 1974ను తుంగలో తొక్కడం భాధాకరమన్నారు. మూసీ నది పరిరక్షణ తరహాలో మంజీరా నది పరిరక్షణకు ప్రత్యేక బోర్డును ఏర్పాటుచేయాలని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిచే పూల పండుగ బతుకమ్మ

- **నేటి నుంచి బతుకమ్మ వేడుకలు ప్రారంభం**
- **పాఠశాలల్లో ముందస్తు వేడుకలు**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్:తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిచేలా జరిగే అతి పెద్ద పూల పండుగ బతుకమ్మ. దేవున్ని పూజించేందుకు ఉపయోగించే పూలనే పూజించే గొప్ప పండుగ ఇది. తెలంగాణలో ఆడబిడ్డలంతా ఏకమై సంబురంగా జరుపుకొనే ఘనమైన వేడుక ఇది. ఒక్క మాటలో చెప్పాలంటే ప్రపంచంలో మరెక్కడా కనిపించని, తెలంగాణకు మాత్రమే సొంతమైన, వినూత్నమైన, అరుదైన పూల వేడుక బతుకమ్మ. బతుకమ్మ అంటే బతుకుదెరువును మెరుగుపరిచే అమ్మ అని అర్థం. తొమ్మిది రోజులు తెలంగాణ అంతటా ఒక జాతరలా సాగి చివరిరోజు సద్దుల బతుకమ్మగా మన వాకిట్లో బతుకుదెరువును ఆవిష్కరిస్తుంది. ఆటపాటలతో మనల్ని సేదతీరుస్తుంది. జీవన సంబురాన్ని ఆవిష్కరిస్తుంది. స్వరాష్టంలో రాష్ట్ర పండుగగా గుర్తింపు పొంది నేడు ప్రపంచంలో తెలంగాణ వారున్న చోటల్లా పూలజాతరై వర్ధిల్లుతోంది. బతుకమ్మ వేడుకను ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుంచి తొమ్మిది రోజులు ఎంతో వైభవంగా జరుపుకుంటారు. భాద్రపద అమావాస్య లేదా పెత్రమాస రోజు నుంచి అశ్వయుజ అష్టమి వరకు తొమ్మిది రోజులు ఈ సంబురం కొనసాగుతుంది. ఆడబిడ్డలంతా చివరి రోజు అశ్వయుజ అష్టమి నాడు ఉపవాసం పాటిస్తూ, స్నానాధికాలు ముగించుకుని, ముందుగా చిన్న బతుకమ్మను పేరుస్తారు. గౌరమ్మను నిలుపుకొంటారు. అంతేకాకుండా సద్దులు





సమర్పిస్తారు. ప్రకృతిలో లభించే ప్రతి పువ్వునూ ఏరికోరి తెచ్చి, బతుకమ్మలను పేరుస్తారు. అంతేకాకుండా బతుకమ్మ వేడుకలో ఉపయోగించే పూవుల్లో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. పూల నుంచి వచ్చే పరిమళాలు, వాటి లేలేత స్పర్శ ఆరోగ్యాన్ని పెంచుతాయన్నది నిపుణుల మాట. రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన గౌరమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ ఆడే వేడుక బతుకమ్మ. కాగా నేడు బుధవారం నుంచి చిన్నబతుకమ్మ వేడుకలతో బతుకమ్మ సంబురాలు రాష్ట్రమంతటా ప్రారంభం కానున్నాయి.

**ముస్తాబాద్‌లో ముందస్తు వేడుకలు...**

బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ముస్తాబాద్ మండలంలో ముందస్తు వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాల్లో పాఠశాలల్లో విద్యార్థినీలు బతుకమ్మలను పేర్చి పాఠశాలకు తీసుకు వచ్చి పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసి బతుకమ్మ ఆట పాటతో వేడుకలను సంబురంగా జరుపుకున్నారు. ముస్తాబాద్‌లోని అంబేద్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వేడుకలను చేపట్టగా విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్ గౌడ్, ఉపాధ్యాయులు అంజ గౌడ్, బిక్షపతి తదితరులున్నారు.

## పువ్వులను పూజించే సాంప్రదాయం మన ఆడపడుచులది

- **ట్రినిటీ ఆధ్వర్యంలో 24అడుగులు బతుకమ్మ**
- **కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి : ప్రపంచ వ్యాప్తంగా ప్రతి దేవుడిని పువ్వులతో పూజిస్తాము.. కానీ ఆ పువ్వులనే పూజించే సంప్రదాయం తెలంగాణ ఆడపడుచులకే దక్కిందని కోమటిరెడ్డి లక్ష్మి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ కే వి బి కృష్ణారావు, విద్యాసంస్థల డైరెక్టర్ అండ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉజ్జని మంజులలు 24అడుగుల బతుకమ్మ కార్యక్రమాన్ని చౌటుప్పల్ మార్కెట్ యార్డులో మంగళవారం ఏర్పాటు చేశారు. బతుకమ్మ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోమటిరెడ్డి లక్ష్మీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థిని విద్యార్థులతో ఆనందంగా ఆహ్లాదంగా బతుకమ్మ పాటలకు అనుగుణంగా కోలాటం ఆడారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ ఉగ్రరూపమైన సూర్యుని చూపెడుతూ బాలబాలికలు బతుకమ్మ చుట్టూ ఆడుతూ ఉంటే సూర్యుడు వెలవెల పోయాడన్నారు. 3వేల మంది ట్రినిటీ బాలబాలికలతో ఈ కార్యక్రమాన్ని పంచుకోవడం ఎన్నటికీ మరువలేని అనుభూతిని కలిగించిందన్నారు. భారీ బతుకమ్మను ఏర్పాటు చేసి నన్ను ఆహ్వానించిన ట్రినిటీ విద్యాసంస్థలను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్నారు .ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డిరాజు, రాజగోపాల్ రెడ్డి కోడలు తరుణ్యా సంకీర్త రెడ్డి, వివిధ వార్డులకు కౌన్సిలర్లు మండల, బ్లాక్ అధ్యక్షులు, పుర ప్రముఖులు ,విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, మండల గాంధీ గ్లోబల్ సభ్యులు వెన్ రెడ్డిసంధ్య తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అండ ఎర్రజెండా

**సిపిఎం పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్**




ప్రజాస్ఫూర్తి, మహబూబాబాద్ జిల్లా: భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ మహబూబాబాద్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆకుల లక్ష్మయ్య కాలనీ ఐదవ శాఖ మహాసభ ఎండి ఇమామ్ అధ్యక్షతన జరిగాయి. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాం నాయక్ పాల్గొని మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం పార్టీ బలోపేతం కోసం కార్యకర్తలు అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.రానున్న రోజుల్లో సిపిఎం పార్టీని ప్రతి వార్డు బలోపేతం చేసి ప్రభుత్వాలు చేసే ప్రజావ్యతిరేక విధానాలకు పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని అందుకు సిపిఎం పార్టీని ప్రజలు ఆదరించాలని కోరారు. ముందుగా సిపిఎం పార్టీ జెండా సిపిఎం శాఖ నిర్మాణ బాధ్యుడు కుమ్మరి కుంట్ల నాగన్న ఆవిష్కరించారు. తదనంతరం అమరులైన వారికి రెండు నిమిషములు మౌనం పాటించి సంతాపాన్ని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ సభ్యులు తోట శ్రీనివాస్ ప్రకటించారు.నూతన కార్యదర్శిగా బోడ శంకర్,చిట్టి మల్ల ఉపేందర్ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు శ్రీరాములు, శాంతక్క,బాలు,మోహన్, వెంకన్న,పాషా, రఘు,కర్ణాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్ట్ పార్టీ ఏరియా కమిటీ దళసభ్యుడు



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అళ్లపల్లి మండలం, అడవిరామారం గ్రామానికి చెందిన నిషేధిత మావోయిస్ట్ పార్టీకి పని చేస్తున్న ఏటూరునాగారం మహదేవపూర్ ఏరియా కమిటీ దళసభ్యుడు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసుల ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోవడం జరిగింది. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యుడి వివరాలను ఓ ప్రకటనలో తెలిపారు.మడకం ఇడుమయ్య (మహేష్) 22 అడవిరామారం గ్రామం, ఆళ్లపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నియో కరిగుండెం గ్రామం, చింతగుప్ప పోలీస్ స్టేషన్ సుకమ జిల్లా, ఛత్తీస్గడ్ రాష్ట్రం, మడకం ఇడుమయ్య (మహేష్) 15 సంవత్సరాల క్రితం కరిగుండెం గ్రామం, ఛత్తీస్గడ్ రాష్ట్రం నుండి అడవి రామారం గ్రామం, ఆళ్లపల్లి మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు వలస రావడం జరిగినది. ఇతను 3 వ తరగతి వరకు అడవిరామారం నందు చదువుకున్నాడు. చాలా సంవత్సరాలు వ్యవసాయ కూలీగా పనిచేసిన అనంతరం తేదీ 30.01.2023న తనకు సోదరుడయిన పునేం ఇడుమయ్య 10 అడవిరామారం అవే వ్యక్తితో కలిసి టి ఎస్ సి ఎం దామోదర్ సమక్షంలో నిషేధిత సిపిఐ మావోయిస్ట్ పార్టీలో సభ్యుడిగా చేరి మావోయిస్ట్ పార్టీ భద్రతా బలగాలపై చేసిన వివిధ దాడుల్లో పాల్గొన్నాడు. నిషేధిత సీపీఐ మావోయిస్ట్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడైన కంకణాల రాజిరెడ్డి (వెంకన్న)కు గార్డ్ గా కూడా ఇతను పని చేశాడు. నిషేధిత సిపిఐ మావోయిస్ట్ పార్టీకి చెందిన నాయకులు , దళసభ్యులు ఆదివాసీ ప్రజలను బెదిరిస్తూ, యువత్ యువకులను, మైనర్ బాలబాలికలను మిలీషియాలో , దళాల్లో బలవంతంగా చేర్చుకుంటూ ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ నిషేధిత సిపిఐ మావోయిస్ట్ పార్టీకి ఎవరూ సహకరించవద్దని, మావోయిస్ట్ పార్టీకి వ్యతిరేకంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవాలని, తమ ప్రాంత అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా ఆదివాసీ గ్రామాల ప్రజలను కోరుచున్నాము.లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే దళ సభ్యులు వారి కుటుంబ సభ్యుల ద్వారా గానీ, స్వయంగా గానీ తమ దగ్గరలోని పోలీస్ స్టేషన్లో లేదా జిల్లా ఉన్నతాధికారుల వద్ద గానీ సంప్రదించగలరని విజ్ఞప్తి చేస్తున్నాము. లొంగిపోయే దళసభ్యులకు జీవనోపాధి,పునరావాసం కల్పించడం కోసం ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల ప్రతిఫలాలను అందించడానికి జిల్లా పోలీస్ యంత్రాంగం కృషి చేస్తుంది. ఇప్పటికే అనేకమంది నిషేధిత సిపిఐ మావోయిస్ట్ పార్టీ నాయకులు, సభ్యులు తమ పార్టీ ప్రజలలో ఆదరణ కోల్పోయిందని గ్రహించి ఈ సిద్ధంతాలు విజయం సాదించలేవని తెలుసుకొని, ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని అనేకమంది పోలీసు వారి సమక్షంలో లొంగిపోవడం జరుగుచున్నది.

## రాజపేట అంగన్వాడీ కేంద్రం - 1 లో గ్రాండ్ పేరెంట్స్ డే సంబరాలు

రాజపేట, (ప్రజాస్ఫూర్తి) : రాజాపేట మండల కేంద్రంలోని రాజపేట 1 అంగన్వాడి కేంద్రం లో అంగన్వాడి టీచర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వయోవృద్ధుల టోల్ ఫ్రీ నెంబర్ 14567, వృద్ధుల పట్ల ప్రేమానురాగాలను చూపించాలని వృద్ధులని మన చిన్న పిల్లల్ని ఏ విధంగా అయితే చూసుకుంటామో అదేవిధంగా మన తాతా మమ్మల్ని కూడా చూసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వయవృద్ధులకు చేనేత శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాగార్జున, స్వప్న,సంధ్య,ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం శ్రీమతి తల్లులు పాల్గొన్నారు.

## మాంటిసోరి హై స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



రాజపేట, (ప్రజాస్ఫూర్తి) : రాజపేట మండల కేంద్రంలోని మాంటిసోరి హై స్కూల్ ఇంగ్లీష్ మీడియం లో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ దశరథ గౌడ్ కౌసల్య ల ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు లలితాదేవి ఉపాధ్యాయ బృందం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు నూతన వస్త్రాలు ధరించి పోటా పోటిగా పేర్చిన బతుకమ్మలను వెంట తీసుకొచ్చి పాఠశాల ఆవరణలోని క్రీడా మైదానంలో ఒకచోట ఏర్పాటు చేసి పండుగ జరుపుకున్నారు. విద్యార్థినులు మహిళా టీచర్లు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. పోటాపోటీగా విద్యార్థులు ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలు పాడారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. ప్రజలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు, విద్యార్థులకు, బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి రుద్రాభిషేకం



రాజాపేట, (ప్రజాస్ఫూర్తి) : మండల కేంద్రమైన రాజాపేట లోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మంగళవారం రాత్రి పరమశివుడికి రుద్రాభిషేకం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వస్తి శ్రీ క్రోధి నామ సంవత్సర భాద్రపద బ! త్రయోదశి మాసశివరాత్రి సందర్భంగా శ్రీ రామకృష్ణ సాయి మందిరం భజన మందిరం లో సాయంత్రం 6 గంటలకు రుద్రాభిషేకములు పంచామృతాభిషేకములు,ఫలరసాభిషేక ములు విశేష అభిషేకములు ఆలయ అర్చక స్వాములు చెలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ నిర్వహించారు. భక్త మహా శయులు సాంప్రదాయ దుస్తులు ధరించి స్వామి వారి అభిషేకములో ఫాల్గొన్నారు. తీర్థ ప్రసాదములు తీసుకొని భోళాశంకరుని కృపకు పాత్రులయ్యారు. పూజ నిర్వహణ ప్రసాదం దాత మంచాల భద్రయ్య కవిత దంపతులు అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో అభిషేక పూజలో పాల్గొన్నారు. సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం వేద ఆశీర్వచనం చేసి ఆలయ అర్చక స్వాములు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బల్ల దామోదర్, నంగునూరు రాజు, ఉప్పల రమేష్, చామకూర భద్రయ్య, ఉపేందర్ తదితరులు ఉన్నారు.

## చిన్నారుల్లో వ్యాధి నిరోధక శకి పెంచాలి

**- ఏ డి పి హెచ్ ఓ డాక్టర్ మనోహర్**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: పుట్టిన వెంటనే ప్రతి చిన్నారికి ముర్రుపాలు తాగించి వ్యాధి నిరోధక శక్తిని పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఏ డి పి హెచ్ ఓ డాక్టర్ మనోహర్ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామం ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బందికి మంగళవారం ఆశ డే నిర్వహించారు. డాక్టర్ మనోహర్ తో పాటు పి ఓ ఎన్ సి డి డాక్టర్ ఎం సుమన్ కళ్యాణ్, డాక్టర్ సంపత్, డాక్టర్ కాటమరాజులు ఆశ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని సూచికలో మొదటి స్థానంలో ఉంచాలని, అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఇన్స్టిట్యూషనల్ డెలివరీలను పెంచాలని, అబార్షన్లను తగ్గించాలని సూచించారు. టీబీ లెప్రసీ మొదలగు వ్యాధుల గూర్చి అవగాహన కల్పించాలని, సరైన సమయంలో వైద్యం అందించాలని, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు సరైన సమయంలో ఇవ్వాలన్నారు. పుట్టిన వెంటనే ముర్రు పాలు పట్టించి, పిల్లలలో ఈ వ్యాధి నిరోధకత పెంచాలని, అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్ నిర్వహించి వ్యాధి ఉన్న ప్రతి ఒక్కరికి మందులు సరిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ వో, ఎస్ యూ వో, హెచ్ ఈ ఓ, పి హెచ్ ఎన్, ఎం పి హెచ్ ఎస్, ఎం పి హెచ్ ఏ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## అక్షర స్కూల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




ప్రజాస్ఫూర్తి, మహబూబాబాద్ జిల్లా : మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని గంధంపల్లి గ్రామంలో గల అక్షర ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ రమేష్ , ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో విద్యార్థులు తెలంగాణ అస్తిత్వానికి, సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా, ప్రకృతిని దేవతగా పూజించే స్త్రీలలో ఉన్న ఆధ్యాత్మికతమైన శక్తికి ప్రతిరూపకంగా జరుపుకునే బొడ్డెమ్మ, బతుకమ్మ ఉత్సవ వేడుకలు విద్యార్థులతో కలిసి అంగరంగ వైభవంగా నిర్వహించారు.

# ఊరెళ్తున్నారా జాగ్రత్త!

- * గుండాల మండల ప్రజలకు పోలీసుల సూచన
- * దసరా సెలవుల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి
- * సబ్ ఇన్స్పెక్టర్ సైదులు

ప్రజాస్ఫూర్తి, గుండాల: దసరా సెలవుల్లో గుండాల పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సైదులు ప్రజలకు సూచించాడు. గ్రామాలలోనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొత్తవారి కదలికలపై సమాచారం అందించాలని ప్రజలను కోరాడు.చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపడుతున్నామని పగలు,రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నామని అన్నాడు.పిల్లలకు సెలవులుండటంతో చాలా మంది ప్రయాణాలు చేస్తారని ఇదే అదనుగా దొంగలు చేతివాటం చూపే ప్రమాదం ఉందని సెలవులలో విహార యాత్రలు, తీర్థ యాత్రలు, ఊళ్లకు వెళ్ళే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఊళ్లకు వెళ్ళేవారు ఇంటిని గమనించమని ఇరుగు,పొరుగు నమ్మకస్తులైన వారికి చెప్పి వెళ్లాలని



పేర్కొన్నాడు.ఇంటికి తాళం వేసిన తర్వాత తాళం కనబడకుండా డోర్ కర్టెన్ వేయాలి. అదేవిధంగా బయట గేటుకు తాళం వేయకపోవడం మంచిదని ప్రజలకు సూచించాడు.గ్రామాలకు వెళ్లే వారు ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలని విలువైన వస్తువుల సమాచారాన్ని,వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదన్నాడు.తాళం చెవి ఇంటి పరిసర ప్రాంతాలలో పెట్టకూడదని అనుమానాస్పద వ్యక్తులను ఇంట్లోకి రానివ్వకూడదని అన్నాడు. దొంగలు పగటి వేళల్లో కాలనీల్లో చిరువ్యాపారుల్లా, సేల్స్ రిప్రజెంటేటివ్‌ల్లా, అడ్రెస్ కోసం వెతుకుతున్న వారిలా పర్యటిస్తూ రెక్కీ నిర్వహిస్తారని ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులుంటే స్థానిక పెట్రోలింగ్ పోలీసులకు మరియు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని ఇంట్లో బంగారు నగలు, నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం. లేదా ఎక్కువ రోజులు ఉళ్ళకు వెళ్లేవారు విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లాలని అన్నాడు.వీలైతే ఇంటి ఆవరణలో పెంపుడు కుక్కలను కట్టేయాలని ఇంట్లో ఎటువంటి శబ్దం, అలికిడి వినిపించినా వెంటనే అప్రమత్తం కావాలని అలసత్వంగా ఉండరాదని హెచ్చరించాడు.తమ ప్రాంతంలో పోలీస్ గస్తీ ఏర్పాటుకు సహకరించాలని పోలీసు స్టేషన్ నెంబర్, బ్లూ కోల్ట్స్,పెట్రో కార్ పోలీస్ సిబ్బంది నెంబర్,స్థానిక పోలీసు స్టేషన్ నెంబర్ దగ్గరుంచుకోవడం మంచిదని సూచించారు. కాలనీలలో,గ్రామాలలో అనుమానాస్పద, కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే 100 డయల్ కు సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని, గుండాల సబ్ ఇన్స్పెక్టర్ సైదులు తెలిపారు.





## విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర,సాంకేతిక,క్రీడా రంగాల్లో రాణించాలి

- * బాలానగర్ జోన్ ఏసిపి.జి.హనుమంతరావు
- * ఘనంగా క్యాపిటల్ విద్యాసంస్థలు "ఫ్రెషర్స్ డే వేడుకలు

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : విద్యార్థులు విద్యతో పాటు శాస్త్ర,సాంకేతిక,క్రీడా రంగాల్లో రాణించి దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని బాలానగర్ జోన్ ఏసిపి. జి.హనుమంతరావు అన్నారు. మంగళవారం క్యాపిటల్ విద్యాసంస్థలు షాపూర్ నగర్,కొంపల్లి బ్రాంచీలకు చెందిన"ఫ్రెషర్స్ డే పార్టీ"ఎల్ గంజా"వేడుకలు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,గాజులరామారం డివిజన్ హెచ్.ఏ.ఎల్ కాలనీ పరిధి న్యూ సిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో విద్యార్థుల కేరింతల నడుమ ఉత్సాహంగా నిర్వహించారు. .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన తోపాటు ప్రత్యేక అతిథి ప్రముఖ నేపథ్య గాయని ఎం.ఉష,ప్రైమ్ 9 న్యూస్ అధినేత,రాజకీయ విశ్లేషకులు డివివి.సత్యనారాయణ,క్యాపిటల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్.దాయక సత్యనారాయణ,డైరెక్టర్ తాటిచెర్ల హేమలత లు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా బాలానగర్ ఏసీపి మాట్లాడుతూ విద్యార్థులు తెలివితేటలు, నైపుణ్యాలతో పాటు శారీరక దారుఢ్యం పెంపొందిచుకొని మంచి ఉద్యోగాలు సంపాదించి దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. విద్యార్థులు పట్టుదల కనబరిస్తే ఏ రంగంలోనైనా రాణిస్తారన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందిస్తున్న క్యాపిటల్ విద్యసంస్థల యాజమాన్యాన్ని అభినందించారు.రాజకీయ విశ్లేషకులు డివివి.సత్యనారాయణ మాట్లాడుతూ దేశాభివృద్ధిలో విద్యార్థులకు ప్రాముఖ్యత ఎంతో కీలకమన్నారు.క్యాపిటల్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ దాయక సత్యనారాయణ మాట్లాడుతూ తమ కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ప్రతి సంవత్సరం మంచి ఫలితాలను సాధిస్తూ ఉద్యోగ కల్పనకు తమ వంతుగా ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు.డైరెక్టర్ హేమలత మాట్లాడుతూ విద్యతో పాటు విద్యార్థులు ఎంచుకున్న రంగాలలో వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్నామని డిగ్రీ,పీజీ కళాశాలలతో పాటు ఇంటర్ విద్యలో రాణించనున్నట్లు పేర్కొన్నారు.అంతకుముందు గాయని




ఎం.ఉష తన పాటలతో విద్యార్థుల్లో జోష్ నింపారు. ఆమె పాటలకి విద్యార్థిని,విద్యార్థులు చేసిన నృత్యాలు అహుతులను అలరింపజేశారు. చివరిగా బతుకమ్మ పాటలకి ఆట పాటలతో దసరాకి స్వాగతం పలికారు. కార్యక్రమం ఆద్యంతం ఆహుతులను, తల్లిదండ్రులను అలరించింది. అందరికి యజమాన్యం దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## యుపిహెచ్ సీ కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాన్ని పరిశీలన



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి ) : మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బోడుప్పల్ లో నూతనంగా నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ కోసం గుర్తించిన ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం మెడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డాక్టర్ టి. రఘునాథ్ స్వామి , కీసర డివిజన్ ఉప జిల్లా వైద్య , ఆరోగ్య అధికారి డాక్టర్ సత్యవతి, జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ మంజులా రెడ్డి, వైద్య అధికారి డాక్టర్ శోభనా , బస్తీ దవాఖాన వైద్య అధికారి డాక్టర్ ప్రవీణ్ లు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బోడుప్పల్ లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్మాణం కోసం ఆ స్థలం అనుకూలతను ఈ బృందం సవివరంగా పరిశీలించారు. ఈ యుపిహెచ్సి స్థాపన వల్ల నగర జనాభాకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి సహకారం అందనుందన్నారు. సమీక్ష అనంతరం, బృందం బోడుప్పల్ మునిసిపల్ కమిషనర్ ను వారి కార్యాలయంలో కలసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం పై చర్చించారు. ఈ సందర్భంగా మౌలిక వసతులు, నిధుల కేటాయింపు , ఆరోగ్య, మునిసిపల్ శాఖల మధ్య సమన్వయం పైన చర్చించి, ప్రాజెక్ట్ త్వరగా పూర్తి కావడానికి అవసరమైన చర్యలను చర్చించారు. అనంతరం నూతనంగా నిర్మించిన నారాపల్లిలోని ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలో కొరెముల్లా గ్రామలోని సబ్ సెంటర్ ను కూడా వారు సందర్శించారు.

## రిటైర్డ్ ఏసిపి శ్రీధర్ గౌడ్ కి ఘన సన్మానం



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కూకట్పల్లి జోన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ గా పనిచేసి పదవి విరమణ పొందిన గనగాని శ్రీధర్ గౌడ్ ని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షుడు బి వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీధర్ గౌడ్ ప్రజలకు మెరుగైన సేవలను అందించారని కొనియాడారు ఆయన గ్రేటర్ పురోఅభివృద్ధికి ఎంతో పాటు పడ్డారని శ్రీధర్ గౌడ్ సేవలను కొనియాడారు.

## బాగ్ అమీర్ లో ఓపెన్ జిమ్ ప్రారంభం



శేరిలింగంపల్లి , (ప్రజాస్ఫూర్తి ) : శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ పరిధిలో బాగ్ అమీర్ లో జీవి హైట్స్ విశాల్ టవర్స్ లోని గల పార్క్ లో భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఆధ్వర్యంలో సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ని మంగళవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ , భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఎండి కె. రామ్మోహన్ రావు , డైరెక్టర్ వై. దనుత లతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజా దేవి రంగారావు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాగ్యనగర్ గ్యాస్ లిమిటెడ్ ఎండి రామ్మోహన్ రావు కి కృతజ్ఞతలు తెలుపుతూ డివిజన్ లో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. రాబోయే రోజుల్లో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా ఉండాలని కోరారు.

## కుర్రారం లో అక్రమ ఇసుక రవాణాపై స్పందించిన రెవెన్యూ అధికారులు

**ఇసుక దోపిడిబాగోతంపై కలెక్టర్ కు నివేదిక**
**ఇసుక డంప్ లు సీజ్, ట్రాక్టర్ల పై కేసు నమోదుకు సిఫారస్**



రాజాపేట, (ప్రజాస్ఫూర్తి) : ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సంచలనం కలిగించిన రాజాపేట మండలం కుర్రారం ఇసుక మాఫియా బాగోతంపై ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు స్పందించారు. మంగళవారం తహసీల్దార్ దామోదర్ ఆదేశాల మేరకు ఆర్ఐ నర్సింలు కురారం గ్రామంలో ఉన్న అక్రమ ఇసుక డంపుల పై పంచనామా నిర్వహించి, ఇసుక తరలించిన చెక్ డాం సమీప ప్రదేశ వివరాలను అధికారులకు పంపారు. కేవలం నాలుగు ట్రిప్పుల అనుమతి తీసుకున్న ఇసుక ట్రాక్టర్ల యజమానులు 14 ట్రిప్పులను అక్రమంగా ఇసుక రవాణా చేసి డంపు చేసి రోజుకు వేలకు వేలు దండుకుంటున్నట్లు రెవెన్యూ అధికారుల విచారణలో తేలడంతో చర్యలు గైకొనాలని కోరుతూ కేసులు నమోదు చేయాలని కోరారు. ఈ విషయంపై రాజకీయ వత్తిళ్లు వస్తున్నట్లు రెవెన్యూ అధికారులు విలేకరులకు తెలియజేశారు. ఎలాంటి వత్తిళ్లకు తలగకుండా విధులు నిర్వర్తించాలని ప్రజలు రైతులు కోరుతున్నారు.

# ఘనంగా అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు మంగళవారం ఐడిఓసి మీటింగ్ హాల్ లో మహిళా, శిశు, దివ్యాంగుల , వయోవృద్ధుల సంక్షేమ శాఖ, జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోషియోషన్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిధిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ , సీనియర్ సిటిజన్ అసోసియేషన్ సభ్యులు జ్యోతి ప్రజ్వలన, కేక్ కటింగ్ చేసి వేడుకలను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ వయోవృద్ధుల సమస్యలపై నిర్దిష్ట ప్రణాళిక ప్రకారం జిల్లాలోని అధికార యంత్రాంగం పనిచేస్తుందని,సీనియర్ సిటిజన్స్ అసోషియోషన్ కమ్యూనిటీ భవనానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, రాయితీలు, సంక్షేమ పథకాల అమలుకై ప్రభుత్వ దృష్టికి తీసుకొని వెలుతామని, అటలు, యోగా, ఆహ్లాదకరమైన వాతావరణం కొరకు క్యాలండర్ ప్రకారం కార్యకలాపాలు కాలానుగునంగా తయారు చేసుకొవాలన్నారు. కుటుంబ వ్యవస్థలో ఉన్న సమస్యల దృష్టి నుండి సమాజ వైపు మరలాలని తద్వారా గౌరవం, హోదా వస్తాయన్నారు. కుటుంబ వ్యవస్థలో స్వేచ్ఛ ద్వారా అనేక సమస్యలను దూరం చేయవచ్చని, బిపి, షుగర్ వివిధ సమస్యలతో బాధపడే వృద్ధులు ప్రతిరోజు నడక, వ్యాయామం, యోగ, ఆయూష్ మందులు వాడటం ద్వారా మంచి పలితాలు పొందవచ్చన్నారు. వివిధ రంగాలలో పనిచేసే వారు తమ అనుభవాలను, సూచనలు,సలహాలు ఇవ్వడం ద్వారా జిల్లా యంత్రాంగము అట్టి విషయాల పై దృష్టి సారించి క్యాలండర్ తయారు చేసి పనిచేస్తామని తెలిపారు. నేషనల్ మారథన్ రన్నర్ యార్లగడ్డ వెంకటేశ్వర్లు, రచయిత శాగంటి కృష్ణమూర్తి, ఔషధ మొక్కలను పెంచడం వాటి ఉపయోగాలు రావి వెంకటయ్య, వృద్ధాశ్రమ నిర్వాహకులకు, సీనియర్సిటిజన్ అసోషియోషన్ సభ్యులకు సన్మానించారు. ఈ వేడుకలలో సిడిపిఒ లక్ష్మీప్రసన్న, విజయ కుమారి, జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోషియోషన్ సభ్యులు కె. నాగేశ్వరరావు, సిహెచ్ కృష్ణయ్య, పి.యస్.యన్ రెడ్డి, కె.సందీప్, జి.భూషన్ రావు , భాస్కర్ రావు, వెస్లీ, యూసఫ్, జయరామ్, శివప్రసాద్, నాగేశ్వరరావు, రాములు, సిబ్బంది పి.వరప్రసాద్, ఎ.నరేష్ పాల్గొన్నారు.

# వయోవృద్ధులుకాలానికి అనుగుణంగా జీవనశైలి మార్చుకోవాలి

* **జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో**

ప్రజాస్ఫూర్తి, మహబూబాబాద్ జిల్లా : మారుతున్న కాలానికి అనుగుణంగా సీనియర్ సిటిజన్స్ (వయో వృద్ధులు) వీలుంటే తమ జీవనశైలిని మార్చుకోవాలని మహబూబాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో కోరారు. మంగళవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని, జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ




ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా సీనియర్ సిటిజన్స్ (వయోవృద్ధులు) తమ జీవన శైలిని మార్చుకోవాలన్నారు.స్మార్ట్ ఫోన్, కంప్యూటర్, ల్యాప్టాప్, తదితర ఆన్లైన్ సేవలు వినియోగించుకుంటే తమ పని తాము చేసుకున్నట్లు ఉంటుందని వీలున్న వయోవృద్ధులు సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సీనియర్ సిటిజన్స్ లను గౌరవించాలని, వారి ద్వారానే మనందరం ప్రస్తుతం ఉన్నామని తెలిపారు.సెప్టెంబర్ 25 నుండి అక్టోబర్ 1 వరకు ఈ వారోత్సవాలు నిర్వహించడం జరిగిందని, వివిధ రంగాలలో ప్రతిభ కనబరిచిన సీనియర్ సిటిజన్స్ గుర్తించి వారిని సన్మానించామ్మన్నారు. వారి గౌరవార్థం ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు.వయోవృద్ధులకు ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వారి సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ 14567 కు కాల్ చెయ్యాలని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారిణి వరలక్ష్మి, జడ్పీ సీఈవో నర్మద, అడిషనల్ డిఆర్డిఓ శాంతి కుమారి, సిడిపిఓలు శిరీష, కమల, విజయలక్ష్మి, ఎల్లమ్మ, లక్ష్మి, సంబంధిత శాఖల సిబ్బంది చంద్ర శేఖర్, సారంగం, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**: రాజీవ్ కుమార్**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం ఏ పవర్ హౌస్ బస్తీలో గల షెడ్యూల్ క్యాష్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ కాలేజీ గర్ల్స్ హాస్టల్ లో తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాత్రి జరిగిన విద్యార్థులు ఉన్నత భవిష్యత్తు అనే అంశంపై విద్యార్థుల సమావేశం నిర్వహించారు .ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ కొత్తగూడెం అడిషనల్ జనరల్ మేనేజర్ ఈ అండ్ ఎం రాజీవ్ కుమార్ పాల్గొన్నారు . ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ మా చిన్నతనంలో అనేక సమస్యలతో మేము కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించామన్నారు. హాస్టల్లో పురుగుల అన్నం తిని కష్టాలను దిగమింగి ఒక ఉన్నత లక్ష్యంతో చదువుకొని సింగరేణిలో అంచలంచలుగా అడిషనల్ జనరల్



మేనేజర్ స్థాయికి ఎదగడం జరిగిందని అన్నారు .మా అప్పటి సమస్యలతో మాకు అప్పుడు ఉన్న సౌకర్యాలతో పోల్చి చూసుకుంటే మీకు ఇప్పుడు అనేక సౌకర్యాలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక విధాలుగా సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తూ మీరు ఉన్నత చదువులు చదువుకోవడానికి అనేక సౌకర్యాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ఆ అవకాశాలని ఉపయోగించుకొని మహిళలు విద్యార్థినిలు ప్రత్యేకంగా నేటి పరిస్థితులకు అనుగుణంగా మంచి కోర్సులను ఎంచుకొని కష్టపడి చదువుకోవాలన్నారు. నూతన ప్రపంచీకరణ పారిశ్రామికరణ వేగంగా అభివృద్ధి చెందుతున్న సమయంలో మంచి కోర్సులు ఎంచుకొని కష్టపడి చదివి మీరు అన్ని రంగాలలో విద్యార్థినీలు అభివృద్ధి చెందాలన్నారు. మహిళలు అభివృద్ధి చెందితేనే భారత దేశం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని మీ తల్లిదండ్రులు మీపై ఎంతో నమ్మకంతో మేము పడ్డ కష్టాలు మా పిల్లలు పడకూడదని వాళ్లు ఎన్నో కష్టాలు పడి మిమ్మల్ని ఇంత దూరం పంపించి ప్రయోజకులు కావాలని వారు ఆశిస్తున్నారని మీరు వారి ఆశయాలను ఆకాంక్షలను నెరవేర్చాలన్నారు. సింగరేణి సంస్థలో అంచలంచలుగా ఎదుగుతూ ఎంతో నీతి నిజాయితీగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ డివైజీఎం స్థాయి నుంచి అడిషనల్ జనరల్ మేనేజర్ గా ప్రమోషన్ పొందిన రాజీవ్ కుమార్ ని తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం కోట శివశంకర్ ఆధ్వర్యంలో విద్యార్థులు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, సునీత శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో కొత్తగూడెం డివిజన్ అసిస్టెంట్ షెడ్యూల్ క్యాస్ట్ డెవలప్మెంట్ ఆఫీసర్ సునీత , తెలంగాణ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోట శివశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటా

**:కె. ఎం ప్రతాప్**



ప్రజాస్ఫూర్తి, కుత్బుల్లాపూర్ :సుభాష్ నగర్ డివిజన్ పరిధిలోని భాగ్యలక్ష్మి కాలనీలో జరిగినటువంటి సంక్షేమ సంఘం ఎన్నికలలో ఎస్.విజయసాగర్ రెడ్డి వరుసగా మూడవసారి సంక్షేమ సంఘం అధ్యక్షునిగా ఎన్నికయ్యారు.అదే విదంగా సంక్షేమ సంఘం వారు శ్రీ సాయిబాబా దేవాలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షునిగా బి.యాదగిరి యాదవ్, ప్రధాన కార్యదర్శి గా నందమ్ గౌడ్ ఎన్నికయ్యారు.నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు, దేవాలయ కమిటీ సభ్యులు కుత్బుల్లాపూర్ గ్రామంలోని, సిపిఆర్ కాలనీలో రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, బోకేతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం నాయకులను,శ్రీ సాయిబాబా దేవాలయ కమిటీ సభ్యులను అభినందించారు.సంక్షేమ సంఘం వారికి, దేవాలయ కమిటీ వారికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటానన్నారు.ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాములు యాదవ్, కార్యవర్గ సభ్యులు వి. హరిబాబు,జి.ఎస్. రాజు,ఎస్ కే వి. రాజు, సుందరయ్య,శంకర్ చారి, వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ ఆటా..పాట సెంటర్లలో సౌకార్యాలు కల్పించాలి

**కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: బతుకమ్మ ఆటలు ఆడే బస్తీలు, గ్రామాలు, ప్రధాన సెంటర్లలో మున్సిపల్, గ్రామపంచాయతీ శాఖలు సకల సౌకార్యాలు కల్పించాలని కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు సంబంధిత అధికారులకు మంగళవారం ఆదేశించారు. మున్సిపల్ వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, స్థానిక పెద్దల సహకారం తీసుకొని బతుకమ్మ ఆడే సెంటర్లను గుర్తించి ఆ ప్రాంతాల్లో పారిశుధ్యం, విద్యుత్, త్రాగునీరు వంట సౌకర్యాలు కల్పించాలని మహిళల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బతుకమ్మలు వేసే ఘాట్లను సిద్ధం చేయాలనీ, ఎలాంటి ప్రమాదాలు చేటుచేసుకోకుండా నిత్యం సిబ్బందిని పర్యవేక్షణకు ఉంచాలని సూచించారు. ఆకతాయిలపట్ల పొలిసు శాఖా కఠినంగా వ్యవహరించాలని, పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునే విధంగా ఏర్పాట్లు చేయాల్సిన భాధ్యతను అధికారులు విస్మరించవద్దన్నారు.


# ఘనంగా ఫ్రెషర్స్ డే

జిన్నారం, ప్రజాస్ఫూర్తి 01: సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం జిన్నారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పటాన్చెరువు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. విద్యార్థి జీవితంలో కళాశాల చదువు అత్యంత కీలకమని, భవిష్యత్తును నిర్దేశించే రెండు సంవత్సరాలను శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిం



# ఆపదలో ఉన్న వారికి సీఎం సహాయనిధి భరోసా

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : ఆపదలో ఉండి ఆర్థిక సహాయం కోసం ఎదురుచూసే వారికి సీఎం సహాయనిధి ఎంతో భరోసా నిస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ కైసర్ నగర్, హెచ్ఏఎల్ కాలనీ లకు చెందిన బుట్టి, సంపూర్ణల ఆరోగ్య పరిస్థితి బాగాలేదని స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్య మంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ సందర్భంగా మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.50,000 లు బుట్టి తండ్రి జోషెడ్ కు, రూ. 1,10,000 ల చెక్కులను సంపూర్ణ భర్త పి. వెంకటేశ్వర రెడ్డి లకు మంగళవారం పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి వరమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ను పరామర్శించిన మాజీ మంత్రులు



కాప్రా, ప్రజాస్ఫూర్తి : హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాతృమూర్తి బొంతు కమలమ్మ గత 3 రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే చర్లపల్లిలోని వారి నివాసానికి వెళ్లి కమలమ్మ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించి బొంతు రామ్మోహన్ చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి లను కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ మంత్రులు తన్నీరు హరీష్ రావు, మహమూద్ అలీ , ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్, కర్నె ప్రభాకర్, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్. పన్నాల దేవేందర్ రెడ్డి,మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, గొల్లూరు అంజయ్య,రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, సాయిజెన్ శేఖర్,కాసం మైపాల్ రెడ్డి,మహేష్ గౌడ్,రేగళ్ల సతీష్ రెడ్డి,పడాల శివకుమార్ గౌడ్, ఇంద్రయ్య తదితరులు పాల్గొన్నారు,







# సంస్కృతి లో సంబురంగా బతుకమ్మ

(జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి ) : జగద్గిరిగుట్ట రాజీవ్ గృహ కల్ప లోని సంస్కృతి పాఠశాలలో బతుకమ్మ వేడుకలను కన్నుల పండువగ నిర్వహించారు. విద్యార్థినిలు ఉపాధ్యాయునిలు చూడముచ్చటైన బతుకమ్మలను పేర్చారు. తీరక పూలతో తయారు చేసిన బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ ఆటలాడారు. పిల్లలంతా ఒకే చోట చేరి బతుకమ్మ ఉత్సవాలు జరుపుకోవడంతో తల్లిదండ్రులు కూడా సంబరాలలో పాల్గొన్నారు.



### రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొని..

## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు




**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి. ఉదయం లాభాల్లో ప్రారంభమైన సూచీలు.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొన్నాయి. రిలయన్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లలో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచగా.. ఇన్ఫోసిస్, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు దన్నుగా నిలిచాయి.

సెన్సెక్స్ ఉదయం 84,257.17 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,299.78) స్వల్ప నష్టాల్లో ప్రారంభమైనప్పటికీ.. కాసేపటికే లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 84,648.40 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. రోజంతా ఒడుదొడుకులు ఎదుర్కొంది. చివరికి 33.49 పాయింట్ల నష్టంతో 84,266.29 వద్ద ముగిసింది. నిఫ్టీ 13.95 పాయింట్ల నష్టంతో 25,796.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.82గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, మహీంద్రా అండ్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఇన్ఫోసిస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. ఇండస్ ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, టాటా మోటార్స్, టాటా స్టీల్ షేర్లు నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 70.77 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2671 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

### ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో


## ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం పూర్తి




**న్యూఢిల్లీ:** టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థలైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్-ఏఐఎక్స్ కనెక్ట్ (గతంలో ఎయిరేషియా ఇండియా) విలీన ప్రక్రియ పూర్తయ్యింది. పౌర విమానయాన నియంత్రణ సంస్థ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఈవిషయాన్ని మంగళవారం వెల్లడించింది. విలీనానికి కావాల్సిన నియంత్రణపరమైన ఆమోదాన్ని తెలిపింది. అక్టోబర్ 1 నుంచి ఏఐఎక్స్ కనెక్ట్ కింద నమోదైన విమానాలన్నీ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పేరుతో నడవనున్నాయి. విలీనం అనంతరం కార్యకలాపాలను పరిశీలిస్తామని డీజీసీఏ తెలిపింది.

ప్రస్తుతం ఎయిరిండియా, విస్తారా విలీన ప్రక్రియ జరుగుతోందని డీజీసీఏ చీఫ్ విక్రమ్ దేవ్‌దత్ తెలిపారు. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, ఏఐఎక్స్ కనెక్ట్.. ఈ నాలుగూ టాటా గ్రూపునకు చెందిన విమాన సంస్థలే. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్‌నుబీ ఎయిరిండియాలో విస్తారాను విలీనం చేయాలని టాటా గ్రూప్ నిర్ణయించింది. ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్‌లు రోజువారీగా సుమారు 400 విమాన సర్వీసులు నడుపుతున్నాయి. విలీన సంస్థలో సుమారు 6,000 మంది ఉద్యోగులు ఉంటారు. ఇక ఎయిరిండియాలో విస్తారా విలీన ప్రక్రియ నవంబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది.

## వచ్చే ఏడాదేలోనే థార్ రాక్స్ డార్కర్ మోకా ఇంటీరియర్ ఆప్షన్ కారు డెలివరీ..!




**న్యూఢిల్లీ:** మహీంద్రా అండ్ మహీంద్రా ఇటీవల మార్కెట్లో ఆవిష్కరించిన ఆఫ్ రోడ్ ఎస్‌యూవీ 5-డోర్ థార్ రాక్స్ కోరులో కొత్త ఫీచర్ జత చేసింది. 4ఐ4 వేరియంట్లకు డార్కర్ మోకా ఇంటీరియర్ ఆప్షన్ జత చేశారు. ఎంఎక్స్ 5 ట్రిమ్ వేరియంట్ లోనూ ఈ ఆప్షన్ లభిస్తుంది. అయితే బుకింగ్ సమయంలోనే కస్టమర్లు రెండు ఇంటీరియర్ ఆప్షన్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. అయితే, మోకా ఇంటీరియర్ ఆప్షన్ ఎంచుకున్న కస్టమర్లు అదనంగా ఏమీ చెల్లించాల్సిన అవసరం లేదు. మోకా బ్రౌన్ ఇంటీరియర్స్ తో కూడిన థార్ రాక్స్ కార్ల డెలివరీ వచ్చే ఏడాది జనవరి నుంచి, ఐవరీ ఇంటీరియర్లతో కూడిన థార్ రాక్స్ కారు డెలివరీ విజయదశమి పర్వదినం నుంచి ప్రారంభం అవుతుంది.

మహీంద్రా థార్ రాక్స్ కారు ధర రూ.12.99 లక్షల నుంచి రూ.22.49 లక్షల (ఎక్స్ షోరూమ్) మధ్య ఉంటుంది. మారుతి సుజుకి జిమ్నీతోపాటు ఫోర్స్ గురా 5-డోర్ కార్లకు మహీంద్రా అండ్ మహీంద్రా థార్ రాక్స్ గట్టి పోటీ ఇవ్వనున్నది. తొలుత మహీంద్రా అండ్ మహీంద్రా తన థార్ రాక్స్ కారును లైటర్ ఐవరీ కలర్ ఆప్షన్ లో ఆవిష్కరించింది.

## టాటా గ్రూప్‌లోని రెండు ఎయిర్‌లైన్స్ విలీనం..

### ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో కలిసిన ఏఐఎక్స్ కనెక్ట్

**న్యూఢిల్లీ:** టాటా గ్రూప్‌లోని విమానయాన సంస్థల్లో రెండు విమానయాన సంస్థలు విలీనమయ్యాయి. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్ విలీన ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యింది. పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఈ విషయాన్ని మంగళవారం వెల్లడించింది. అక్టోబర్ 1 నుంచి ఏఐఎక్స్ కనెక్ట్ కింద నమోదైన విమానాలన్నీ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ పేరుతో నడవనున్నాయి.



విలీన ప్రక్రియ పూర్తికావడంతో విలీనం అనంతర కార్యకలాపాలను పరిశీలిస్తామని డీజీసీఏ తెలిపింది. అదేవిధంగా ఎయిరిండియా-విస్తారా విలీన ప్రక్రియ జరుగుతోందని పేర్కొంది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, విస్తారా, ఏఐఎక్స్ కనెక్ట్.. ఈ నాలుగు టాటా గ్రూపునకు చెందిన విమానయాన సంస్థలే. ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో ఏఐఎక్స్ కనెక్ట్‌ను, ఎయిరిండియాలో విస్తారాను విలీనం చేయాలని టాటా గ్రూప్ నిర్ణయించింది. ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్ విలీనం పూర్తయ్యింది.

ప్రస్తుతం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, ఏఐఎక్స్ కనెక్ట్‌లో రోజువారీగా సుమారు 400 విమాన సర్వీసులు నడుస్తున్నాయి. విలీన సంస్థలో సుమారు ఆరు వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ఇక ఎయిరిండియాలో విస్తారా విలీన ప్రక్రియ నవంబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ఈ విలీన ప్రక్రియ దేశంలో పెరుగుతున్న విమాన ప్రయాణ డిమాండ్‌ను కొంత మేర తగ్గించగలదు. విస్తారా-ఎయిరిండియాలో విలీన ప్రక్రియ కూడా పూర్తయితే మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# 'వందలోపే ఆలౌట్ అయినా సరే'..

### కాన్పూర్‌లో వ్యూహంపై రోహిత్

**కాన్పూర్:** టీ20 తరహా విధ్వంసంతో కాన్పూర్ టెస్టును గెలుచుకున్న టీమిండియా రికార్డులు బద్దలు కొట్టింది. వర్షం కారణంగా రెండు రోజులు ఆట సాగని నేపథ్యంలో విజయమే లక్ష్యంగా భారత ఆటగాళ్లు చెలరేగిన తీరు అమోఘం. నాలుగో రోజు బంగ్లాదేశ్‌ను ఆలౌట్ చేశాడు దూకుడే మంత్రగా ఆడాలని సహచరులకు కెప్టెన్ రోహిత్ శర్మ అల్టిమేటం జారీ చేశాడు. ఒక్క బంతిని వదలొద్దని.. బౌండరీలే లక్ష్యంగా విరుచుకుపడాలని సూచించడంతో అద్భుతం ఆవిష్కృతమైంది. రెండు రోజుల్లోనే జయభేరి మోగించడం కోసం తాము అనుసరించిన వ్యూహాన్ని హిట్‌మ్యాన్ మీడియా సమావేశంలో వెల్లడించాడు.

'వర్షం కారణంగా రెండున్నర రోజులు కోల్పోయాం. అందుకని నాలుగో రోజు బంగ్లాదేశ్‌ను త్వరగా ఆలౌట్ చేయాలని.. ఆ తర్వాత బ్యాటుతో వేగంగా వీలైనన్ని పరుగులు చేయాలని భావించాం. అందుకనే ధనాధన్ ఆడాలని నిర్ణయించుకున్నాం. ఆ తరహాలో ఆడే క్రమంలో స్వల్ప స్కోర్‌కే ఆలౌట్ అయ్యే అవకాశముంది.






అయినా సరే రిస్క్ తీసుకోవడానికి సిద్ధమయ్యాం. ధాటిగా ఆడే సమయంలో 100 లేదా 120కే ఆలౌట్ అయినా పర్వాలేదనుకున్నాం' అని రోహిత్ తెలిపాడు. అంతేకాదు పేసర్ ఆకాశ్ దీప్‌పై రోహిత్ ప్రశంసలు కురిపించాడు. ఆకాశ్ అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. దేశవాళీ క్రికెట్‌లో బాగా ఆడాడు. అతడి నైపుణ్యం అమోఘం. సుదీర్ఘ స్పెల్స్ వేయగలడు అని రోహిత్ అన్నాడు.

### తుఫాన్ ఇన్నింగ్స్‌తో..

నాలుగోరోజు కెప్టెన్ రోహిత్, కోచ్ గౌతం గంభీర్ గేమ్ ప్లాన్‌ను కుర్రాడు యశస్వీ జైస్వాల్(72), శుభ్‌మన్ గిల్(39).. కేఎల్ రాహుల్(68)లు పక్కాగా అమలు చేశారు. తుఫాన్ ఇన్నింగ్స్‌తో బంగ్లా బౌలర్లను భయపెట్టారు. దాంతో, 3 ఓవర్లకు స్కోర్ 50 దాటింది. యశస్వీ, గిల్ జోరుతో 10 ఓవర్లకు స్కోర్ 100కు చేరింది.



ఆ తర్వాత రాహుల్, విరాట్ కోహ్లీ(47)లు తమ సహజ శైలికి భిన్నంగా చెలరేగారు. భారీ షాట్లతో విరుచుకుపడిన వీళ్లు వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టగా.. 285-9 వద్ద హిట్‌మ్యాన్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేశాడు. ఆ తర్వాత భారత పేసర్ బుమ్రా(317), స్పిన్ ద్వయం అశ్విన్(350), జడేజా(334)లు బంగ్లాను పడగొట్టారు. అనంతరం 95 పరుగుల లక్ష్య ఛేదనలో యశస్వీ హాఫ్ సెంచరీతో మెరిశాడు. దాంతో, 7 వికెట్ల తేడాతో జట్టుకు చిరస్మరణీయ విజయం కట్టబెట్టారు. దాంతో, అనుకున్నట్టే టీమిండియా 7 వికెట్లతో గెలుపొంది.. 2-0తో సిరీస్ కైవసం చేసుకుంది.


## టైటిల్ పోరులో సమఉజ్జీలు..

### విజయం ఎవరిదో..?

**చైనా:** టెన్నిస్‌లో భావితారలుగా వెలుగొందుతున్న యువకెరటాల మధ్య ఉత్కంఠ పోరు జరుగనుంది. చైనా ఓపెన్ లో ఆద్యంత అదరగొట్టిన టాప్ సీడ్‌లు టైటిల్ వేటకు అడుగు దూరంలో నిలిచారు. వరుస విజయాలతో ఫైనల్‌కు దూసుకెళ్లిన జన్నిక్ సిన్నర్, వరల్డ్ నంబర్ 2 కార్లోస్ అల్కారాజ్‌ల మధ్య ఉత్కంఠ పోరు అభిమానులను అలరించనుంది. సమఉజ్జీల సమరంలో విజేతగా నిలిచేది ఎవరు? అని ఫ్యాన్స్‌లో ఆసక్తి మొదలైంది.

యూఎస్ ఓపెన్ ట్రోఫీ విజయోత్సాహంతో చైనా ఓపెన్‌లో అడుగుపెట్టిన జన్నిక్ సిన్నర్ తడాఖా చూపించాడు. తొలి రౌండ్ నుంచి ప్రత్యర్థులకు చెక్ పెట్టి వచ్చిన ఇటలీ కెరటం మంగళవారం జరిగిన సెమీఫైనల్లోనూ దుమ్మురేపాడు. యున్‌చావోకెటె బును 6-3, 7-6(3)తో చిత్తుగా ఓడించాడు.

మరోవైపు పారిస్ ఒలింపిక్స్‌లో రజతంతో చరిత్రకెక్కిన అల్కరాజ్ కఠిన ప్రత్యర్థి డానిల్ మెద్వెదేవ్‌పై అద్భుత విజయం సాధించాడు. ఉ



త్కంఠ పోరులో 7-5, 6-3తో జయభేరి మోగించి ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ఈ టోర్నీలో స్పెయిన్ స్టార్‌కు ఇది ఐదో ఫైనల్ కావడం విశేషం. ఈకాలంలో మేటి ఆటగాళ్లుగా పేరొందిన సిన్నర్, అల్కారాజ్‌లు ఇప్పటివరకూ 9 సార్లు ఎదురుపడ్డారు. 5-4తో అల్కరాజ్ పైచేయి సాధించగా.. యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ హీరో సిన్నర్ లెక్క సరిచేయాలనే పట్టుదలతో ఉన్నాడు. దాంతో.. బుధవారం జరుగబోయే ఫైనల్లో ఎవరు విజేతగా నిలుస్తారు? అనేది ఆసక్తికరంగా మారింది.

## మూడో ఓపెనర్‌గా అతడే..

### ఆస్ట్రేలియా పర్యటనలో అరంగేట్రం..!

**న్యూఢిల్లీ:** సొంతగడ్డపై వరుసగా 18వ టెస్టు సిరీస్ విజయంతో చరిత్ర సృష్టించింది భారత పురుషుల క్రికెట్ జట్టు. స్వదేశంలో తమ ఆధిపత్యాన్ని చాటుతున్న రోహిత్ సేన త్వరలోనే న్యూజిలాండ్ సవాల్‌కు సిద్ధం కానుంది. అనంతరం నవంబర్‌లో ఆస్ట్రేలియా పర్యటనకు టీమిండియా పకడ్బందీగా వెళ్లనుంది. ఎందుకంటే.. వరుసగా మూడోసారి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులో నిలిచిన భారత్‌కు కీలకమైన సిరీస్ అది. అందుకని బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ2024-25)లో గెలుపే లక్ష్యంగా బలైమన స్క్వాడ్‌ను ఎంపిక చేయనున్నారు.



బోర్డర్- గవాస్కర్ ట్రోఫీలో కెప్టెన్ రోహిత్ శర్మకు జోడీగా యశస్వీ జైస్వాల్ ఓపెనింగ్ చేయడం ఖరారై పోయింది. ఇక బ్యాకప్ ఓపెనర్ కోసం చూస్తున్న టీమిండియాకు రుతురాజ్ గైక్వాడ్ బెస్ట్ చాయిస్ కానున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై హ్యాట్రిక్ విజయం కొట్టేసి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడమే భారత జట్టు ముందున్న లక్ష్యం.

అందుకు తగ్గట్టే ఏడాదిన్నర కాలంగా టీమిండియా ఆట సాగుతోంది. అద్భుతంగా ఆడుతోంది. వరుసగా టెస్టు సిరీస్ విజయాలతో ప్రత్యర్థులను వణికిస్తోంది. ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వీ జైస్వాల్‌లు భీకర ఫామ్‌లో ఉన్నారు. మిడిలార్డర్‌లో కోహ్లి, గిల్, పంత్, రాహుల్‌లు దంచేస్తున్నారు. బుమ్రా, ఆకాశ్ దీప్.. స్పిన్ ద్వయం అశ్విన్, జడేజాలతో బౌలింగ్ యూనిట్ కూడా పటిష్ఠంగా కనిపిస్తోంది.

అయితే.. రోహిత్, యశస్వీలలో ఒకరు గాయపడితే బ్యాకప్‌గా మరో ఓపెనర్ అవసరం. అందుకని స్క్వాడ్‌లో మూడో ఓపెనర్‌గా రుతురాజ్ ఉండే అవకాశముంది. టీ20ల్లో చెలరేగి ఆడే అతడు.. దేశవాళీలో రెడ్ బాల్ క్రికెట్‌లోనూ పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ మధ్యే ముగిసిన దులీప్ ట్రోఫీలోనూ రుతురాజ్ అర్ధ శతకాలతో విజృంభించాడు.

# ఫుట్‌బాల్ దిగ్గజం వీడ్కోలు..

### జెర్సీ నంబర్ రోజే అధికారిక ప్రకటన..!

**స్పెయిన్:** ఫుట్‌బాల్‌లో ఓ దిగ్గజ ఆటగాడి కెరీర్ ముగియనుంది. సుదీర్ఘ కాలంగా అభిమానులను అలరిస్తున్న స్పెయిన్ లెజెండ్ ఆండ్రెస్ ఇనియెస్టా సాకర్‌కు వీడ్కోలు పలుకనున్నాడు. ప్రపంచంలోనే మేటి మిడ్ ఫీల్డర్ అయిన ఆండ్రెస్ ఈ విషయాన్ని మంగళవారం స్వయంగా వెల్లడించాడు. అక్టోబర్ 8వ తేదీన తాను వీడ్కోలు ప్రకటన చేస్తున్నానని అభిమానులకు తెలిపాడు.

తన జెర్సీ నంబర్ 8 కావడంతో.. అదే రోజున ఆటకు అల్విదా చెప్పేందుకు సిద్ధమవుతున్నట్టు సోషల్ మీడియా వీడియో ద్వారా ఆండ్రెస్ వెల్లడించాడు. ఈ వీడియోకు త్వరలోనే మీ ముందుకు రాబోతున్నా 08.10.24 అనే క్యాప్షన్‌తో ఫుట్‌బాల్ స్టార్ పెట్టిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది.

స్పెయిన్ గొప్ప ఫుట్‌బాలర్ అయిన సభ్యుడైన ఆండ్రెస్ ఇనియెస్టా వరల్డ్ కప్ గెలుపొందాడు. రెండు పర్యాయాలు యూరో చాంపియన్‌షిప్(2008, 2012) సాధించిన జట్టులో అతడు భాగమయ్యాడు. ఇప్పటివరకూ ఈ మిడ్‌ఫీల్డర్ 131 మ్యాచుల్లో 13 గోల్స్ కొట్టాడు. పరోక్షంగా 30 గోల్స్



చేయడంలో సహచరులకు సాయపడ్డాడు. ఇక బార్సిలోనా క్లబ్ తరఫున 674 మ్యాచులు ఆడిన ఆండ్రెస్.. 57 గోల్స్ కొట్టడమే కాదు 135 గోల్స్‌కు సాయం చేశాడు. తన సుదీర్ఘ కెరీర్‌లో అతడు మూడు వరల్డ్ కప్‌లు ఆడాడు.

